


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 242, పేజీలు - 08

మంగళవారం, ఫిబ్రవరి 17, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# కదలని కారు

## - కారు జోరు కనిపించకపోవడానికి అసలు రీజన్ అదేనా.?

(గౌటీ బాల సాయి తిలక్ - ప్రశ్న న్యూస్)

తెలంగాణలోని మున్సిపల్ ఎన్నికలు బీఆర్ఎస్ ను కోలుకోనివ్వకుండా చేశాయి. తాము అత్యధిక స్థానాల్లో గెలిచామని చెప్పుకుంటున్నప్పటికీ ఆశించిన స్థాయిలో పెర్ఫార్మెన్స్ ఇవ్వకపోవడం కొంత నేతల్లో, క్యాడర్ లో ఆందోళన నెలకొంది. అయితే అధికారం లేనప్పుడు ఈ మాత్రమైనా స్థానాలను దక్కించుకున్నామంటే చాలు అని సంతృప్తి పొందుతుంది. పదిహేడు మున్సిపాలిటీలను మాత్రమే 116 మున్సిపాలిటీల్లో గెలుచుకుంది. ఏడు కార్పొరేషన్లలో ఒక్కటీ దక్కలేదు.ఈ ఎన్నికల ఫలితాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమవుతుండటం రాజకీయ వర్గాలను సైతం ఆశ్చర్యపరుస్తోంది. బీఆర్ఎస్ కు ఓటు బ్యాంకు ఉన్న స్థానాల్లోనూ వెనకబడి పోవడం పార్టీలో చర్చనీయాంశమైంది.

### నాడు బలంగా ఉన్న చోట..

ముఖ్యంగా పార్టీకి ఒకప్పుడు కంచుకోటలుగా ఉన్న కరీంనగర్, నిజామాబాద్ వంటి చోట్ల కార్పొరేటర్ స్థానాలు గెలవలేకపోతున్నారు. వరంగల్ వంటి చోట్ల ఆదరణ కోల్పోయింది. దక్షిణ తెలంగాణలో అసలు లెక్కలోకి రావడం లేదు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో బీఆర్ఎస్ పునాదులు కూడా కదిలిపోయాయి. ఒకప్పుడు ఈ ప్రాంతాలు పార్టీకి వెన్నెముకగా ఉండేవి. కానీ తాజా మున్సిపల్ ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ భారీగా పుంజుకోవడం, కాంగ్రెస్ తన పట్టును నిరూపించుకోవడంతో బీఆర్ఎస్ మూడో స్థానానికి పడిపోయింది. క్షేత్రస్థాయిలో క్యాడర్ చెల్లాచెదురు కావడం, ద్వితీయ శ్రేణి నాయకత్వం నైరాశ్యంలో ఉండిపోవడంతో కారు పార్టీ ఈ ఎన్నికల్లో అనుకున్నంత బలంగా ప్రదర్శన కనబరచలేదు.

### దక్షిణ తెలంగాణలోనూ..

దక్షిణ తెలంగాణలోనూ బీఆర్ఎస్ పరిస్థితి ఏ మాత్రం మెరుగుడపడలేదని ఈ ఫలితాలు నిరూపించాయి. పాలమూరు, నల్గొండ, ఖమ్మం జిల్లాలను కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా మార్చుకుంది. ఇక్కడ బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఖమ్మంలో కనీసం ప్రధాన ప్రతిపక్షంగా కూడా నిలవలేక పోవడం, దక్షిణ తెలంగాణలో పార్టీ పునరుజ్జీవం ఇక సాధ్యమేనా అన్న అనుమానాలను కలిగిస్తోంది. తెలంగాణ ఉద్యమానికి పురిటిగడ్డ అయిన ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ కేవలం ఒక్క మున్సిపాలిటీ కే పరిమితం కావడం ఆ పార్టీ దుస్థితికి అద్దం పడుతోంది. బీఆర్ఎస్ కేవలం ఉమ్మడి మెదక్ జిల్లా , హైదరాబాద్ శివారు ప్రాంతాలకే పరిమితమవుతోంది. రాష్ట్రంలోని మిగిలిన 80 శాతం ప్రాంతాల్లో ప్రభావం కోల్పోయి, కేవలం మెదక్ తో పాటు సిటీ శివార్లపై ఆధారపడితే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావడం కోసం ప్రయత్నించాలి. కవిత ఎఫెక్ట్ కూడా పనిచేసిందనే చెప్పాలి.

# పెళ్లికి ముందే ఎవరినీ నమ్మొద్దు

## - సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) 'పెళ్లికి ముందే ఎవరినీ నమ్మొద్దు' అని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పెళ్లికి ముందే శారీరక సంబంధంలోకి ఎలా వెళ్తారో అంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. జీవితంలో ఏదైనా ముఖ్యమైన బంధాన్ని ఏర్పరుచుకునే విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేసింది. పెళ్లికి ముందే ఎవరినీ నమ్మొద్దంటూ హితవు పలికింది. ఈ మేరకు ఓ అత్యాచార కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. సుప్రీంకోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. వివాహానికి ముందు అంగీకారంతో శారీరక సంబంధంపై ప్రశ్నించింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారం చేసినట్లు ఆరోపణలున్న వ్యక్తి బెయిల్ పిటిషన్‌ను

2లో..

# హంగ్ మున్సిపాలిటీల్లో వీడని చిక్కుముడి

## - 11 పురపాలికల్లో ఛైర్మన్ ఎన్నిక వాయిదా




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు ముగిసినా, ఇంకా పూర్తి స్థాయిలో పరిస్థితులు చక్కబడలేదు. ఈనెల 11వ తేదీన మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగ్గా ఈనెల 13వ తేదీన వెలువడ్డాయి. అయితే చాలా ప్రాంతాల్లో హంగ్ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఏర్పడటంతో అక్కడ ఎవరు మేయర్, ఛైర్మన్ పీఠాలను దక్కించుకుంటారు అనే ఉత్కంఠ కొనసాగింది. ఈ నేపథ్యంలోనే ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత మేయర్, ఛైర్మన్ ఎన్నిక నిర్వహించారు. కానీ వేర్వేరు కారణాల వల్ల రాష్ట్రంలోని 11 పురపాలికల్లో ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ వాయిదా పడిన 11 మున్సిపాలిటీల్లో జనగామ, ఇల్లందు, సుల్తానాబాద్, కాగజ్‌నగర్, ఇబ్రహీంపట్నం, కేతనపల్లి, జహీరాబాద్, ఖానాపూర్, ఇంద్రేశం, డోర్నకల్, తొర్రూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. అయితే ఈ 11 మున్సిపాలిటీల్లో తిరిగి

2లో..

# జనసేనలో మూడు రకాల కార్యకర్తలు

## - సభ్యత్వ నమోదులో పవన్ కళ్యాణ్ వినూత్న ఆలోచన



అమరావతి (ప్రశ్న న్యూస్) జనసేన పార్టీ తన సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కార్యకర్తల భాగస్వామ్యాన్ని క్రమబద్ధీకరించేందుకు సరికొత్త సభ్యత్వ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో పార్టీలో మూడు రకాల సభ్యత్వ వర్గాలను నిర్ణయించింది. జనసేన పార్టీ తన శ్రేణులను మూడు విభాగాలుగా విభజించింది. మొదటి వారిని ఉద్యమి గా పిలుస్తారు. వీరు పార్టీపై నమ్మకం, అభిమానంతో

2లో..

# టెక్నాలజీ సాయంతో ప్రజలకు సేవలు

## - చంద్రబాబుకు బిల్ గేట్స్ ప్రశంసలు

- చంద్రబాబు ముందుచూపు ఉన్న నేత అంటూ గేట్స్ ప్రశంస
- స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను వివరించిన ముఖ్యమంత్రి
- విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో భాగస్వామ్యానికి నిర్ణయం
- కుప్పం 'సంజీవని' ప్రాజెక్టుపై బిల్ గేట్స్ ప్రత్యేక అభినందన





అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో సరికొత్త అధ్యాయానికి తెరలేచింది. రాష్ట్ర ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో నవ్యాంధ్రకు కొత్త దశ-దిశ లభిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజా సాధికారత, సంపద సృష్టి లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించారు. ఈ సందర్భంగా సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. బిల్ గేట్స్ రాకను చారిత్రాత్మకమని అభివర్ణించిన సీఎం, ఈ భాగస్వామ్యం రాష్ట్ర ప్రజల సాధికారతకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. 1997లో తొలిసారి బిల్ గేట్స్‌ను కలిసి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కేంద్రం ఏర్పాటు ఆవశ్యకతను వివరించిన నాటి నుంచి తమ మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా నిలుపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

### - చంద్రబాబు విజనరీ అని ఆనాడే తెలిసింది

ఈ సమావేశంలో మాట్లాడిన బిల్ గేట్స్, భారత డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. తాను తొలిసారి చంద్రబాబును కలిసినప్పుడే ఆయన ఆలోచనల్లోని ముందుచూపును గ్రహించానని వెల్లడించారు. ఆ రోజుల్లో ఈ విషయంలో నాటి సింగపూర్ ప్రధాని మాత్రమే చంద్రబాబుకు కొంత సమీపంలో ఉండేవారని వ్యాఖ్యానించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వ్యవసాయంలో ఏఐని ఈ స్థాయిలో వినియోగించడం లేదని, కానీ ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో ముందుండటం గొప్ప పరిణామమని అభినందించారు. విపత్తుల నిర్వహణలో టెక్నాలజీతో ప్రాణనష్టం నివారించే వ్యవస్థను ఏర్పాటు చేయడాన్ని ప్రశంసించారు. చంద్రబాబు తనకు "గుడ్ ఓల్డ్ ఫ్రెండ్" అని బిల్ గేట్స్ సరదాగా వ్యాఖ్యానించారు.

2లో..

# కరీంనగర్ కార్పొరేషన్‌పై కాషాయ జెండా

## - బండి వ్యూహంతో కరీంనగర్ కాషాయ వశం




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన కార్పొరేషన్ ఏదైనా ఉందంటే అది కరీంనగర్ మాత్రమే. కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ మేయర్ పీఠాన్ని దక్కించుకునేందుకు అవసరమైన మెజార్టీ మాత్రం అందుకోలేదు. ఈ నేపథ్యంలోనే స్వతంత్రులు, ఇతర పార్టీలకు చెందిన కార్పొరేటర్లను తమ వైపు తిప్పుకునేందుకు బీజేపీ ప్రయత్నాలు చేయగా వాటిని చిత్తు చేస్తూ.. కాంగ్రెస్ పార్టీ కూడా

2లో..

# మా గ్రామాలూ మాకిచ్చేయండి

## -చంద్రబాబుకు తుమ్మల విజ్ఞప్తి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును.. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశం కావడం రాజకీయాల్లో తీవ్ర ఆసక్తిని కలిగిస్తోంది. అమరావతిలోని ఉండవల్లిలో చంద్రబాబు నివాసానికి వెళ్లిన తుమ్మల.. ఆయనతో భేటీ అయ్యారు. వీరిద్దరి మధ్య జరిగిన భేటీలో రెండు రాష్ట్రాలకు మధ్య పలు ముఖ్యమైన అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఏపీ, తెలంగాణ సరిహద్దుగా ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి చర్చించినట్లు సమాచారం. మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజనలో భాగంగా ఏపీలో కలిపిన 5 గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపడానికి సహకరించాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

అదే సమయంలో తిరుమల శ్రీవారి సన్నిధిలో తెలంగాణకు 5 ఎకరాల స్థలం కేటాయించాలని సీఎం చంద్రబాబును తుమ్మల కోరారు. అదే సమయంలో ఖమ్మంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆలయ నిర్మాణానికి సహకరించాలని సీఎం చంద్రబాబును మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా ఖమ్మం జిల్లా పెద్దవాగు పునర్నిర్మాణానికి అయ్యే ఖర్చులో 85 శాతం నిధులను విడుదల చేయాలని కోరారు. మరోవైపు.. సత్తుపల్లి, కొవ్వూరు రైల్వేలైన్, పెనుబల్లి, అమరావతి రైల్వే లైన్ నిర్మాణానికి ప్రయత్నాలు ముమ్మరం చేయాలని అడిగారు. పోలవరం ప్రాజెక్టులో భాగంగా భద్రాచలం ముంపునకు గురి కాకుండా ఉండేందుకు నిర్మించిన కరకట్టకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన భూభాగానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో కలిపిన 5 గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయడం పెద్దవాగు

2లో..

# కాంగ్రెస్ పార్టీవి అరాచక విధానాలు

## - రాష్ట్ర ఎన్నికల సంఘం సమగ్ర విచారణ జరపాలి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని వివిధ మున్సిపాలిటీల్లో జరుగుతున్న ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల సందర్భంగా అధికార కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక, అరాచక విధానాలను అనుసరిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాల్సిన ప్రభుత్వం, పోలీసు బలగాలను అడ్డుపెట్టుకొని గూండాల మాదిరిగా వ్యవహరిస్తుందని విమర్శించారు. స్వయంగా ఎంపీలు, ఎమ్మెల్యేలే గెలిచిన ప్రజాప్రతినిధులను కిడ్నాప్ చేసే ప్రయత్నాలకు పాల్పడ్డారని ఆరోపించారు. తొర్రూరు, జనగామ, క్యాతనపల్లి, కాగజ్‌నగర్ వంటి అనేక పట్టణాల్లో పోలీసులు దారుణంగా వ్యవహరించారని అన్నారు. పోలీసు బలగాలను అడ్డుపెట్టుకొని పలు

2లో..

# కాంగ్రెస్‌కు గట్టి షాక్ ఇచ్చిన ఫిరాయింపు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

## - పటాన్‌చెరులో బీఆర్ఎస్ క్లీన్ స్వీప్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌కు గట్టి షాక్ ఇచ్చారు. ఫిరాయింపు ఎమ్మెల్యేగా కాంగ్రెస్‌లో చేరినప్పటికీ, నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీలను

2లో..

## అనూహ్య రాజకీయాల మధ్య నిజామాబాద్

# మున్సిపల్ ప్రత్యేక సమావేశాలు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దిశానిర్దేశం కట్టుదిట్టమైన ఏర్పాట్లు**

**సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన ప్రిసైడింగ్ అధికారులు**

**నిజామాబాద్ నగర పాలక సంస్థ మేయర్ గా కూరగాయల ఉమారాణి**

**డిప్యూటీ మేయర్ గా సల్మా తహసీన్ ఎన్నిక**





నిజామాబాద్(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లాలోని నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల ప్రత్యేక సమావేశాలు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం, మేయర్/డిప్యూటీ మేయర్, చైర్ పర్సన్/వైస్ చైర్ పర్సన్ ల ఎన్నిక కోసం నిర్వహించిన ఈ ప్రత్యేక సమావేశాలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి మార్గనిర్దేశంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. నిజామాబాద్ నగరపాలక సంస్థ సమావేశానికి నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించగా, బోధన్, ఆర్మూర్ లలో సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, భీంగల్ లో జెడ్పీ సీ.ఈ.ఓ సాయగౌడ్ పీ.ఓగా బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఉదయం 11.00 గంటలకు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఆయా పార్టీల వారీగా సభ్యులు సమావేశ మందిరాలలోకి చేరుకోగా, తెలుగు అక్షరమాలను అనుసరిస్తూ వరుస క్రమంలో నూతనంగా ఎన్నికైన సభ్యులతో ప్రిసైడింగ్ అధికారులు ముందుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా హోదా కలిగిన ఎం.పీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు సైతం స్పెషల్ మీటింగ్ లకు హాజరై మేయర్/డిప్యూటీ మేయర్, చైర్ పర్సన్/ వైస్ చైర్ పర్సన్ ఎన్నికలో పాల్గొన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు సీహెచ్.సత్యనారాయణ రెడ్డి ఎన్నిక ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరిపారు. మధ్యాహ్నం సరిపడా కోరం ఉందని నిర్ధారించుకున్న మీదట ఎన్నిక ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ మేయర్ పదవి కోసం కాంగ్రెస్ అభ్యర్థిగా 49వ డివిజన్ నుండి ఎన్నికైన కూరగాయల ఉమారాణి పేరును ఆ పార్టీకి చెందిన సభ్యుడు అగ్గు బోజన్న ప్రతిపాదించగా, అబుద్ బిన్ అథర్ బలపర్చారు. అలాగే, భారతీయ జనతా పార్టీ మేయర్ అభ్యర్థిగా జి.స్రవంతి రెడ్డి పేరును వీరమాచినేని ప్రమోద్ కుమార్ ప్రతిపాదించగా, ఎర్రం సుధీర్ బలపర్చారు. డిప్యూటీ మేయర్ పదవి కోసం ఎ.ఐ.ఎం.ఐ.ఎం తరపున సల్మా తహసీన్, బీజేపి అభ్యర్థిగా బంటు రాము పోటీ పడ్డారు. దీంతో అధికారులు చేతులెత్తే విధానం ద్వారా ఎన్నిక జరిపించారు. నగర పాలక సంస్థలో మొత్తం 60 కార్పొరేటర్ లతో పాటు నిజామాబాద్ ఎం.పీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతి రెడ్డి, ధనపాల్ సూర్యనారాయణ, పి.రాకేశ్ రెడ్డిలు ఎక్స్ అఫీషియో హోదాలో ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. మొత్తం 65 మంది సభ్యులకు గాను 34 మంది సభ్యులు కాంగ్రెస్ అభ్యర్థిని కూరగాయల ఉమారాణిని మేయర్ గా, ఎఐఎంఐఎం అభ్యర్థిని సల్మా తహసీన్ ను డిప్యూటీ మేయర్ గా మద్దతు తెలిపారు. బీజేపీ అభ్యర్థులుగా పోటీ పడిన జి.స్రవంతి రెడ్డి, బంటు రాములకు 31 మంది మద్దతు లభించింది. దీంతో నిజామాబాద్ నగర మేయర్ గా ఉమారాణి, డిప్యూటీ మేయర్ గా సల్మా తహసీన్ లు ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ క్షేత్రస్థాయిలో స్వీయ పర్యవేక్షణ జరుపుతూ, ఎలాంటి గందరగోళానికి తావులేకుండా ఎన్నికల సంఘం నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ, వీడియో చిత్రీకరణ నడుమ పూర్తి పారదర్శకంగా ఈ ఎన్నికల ప్రక్రియను జరిపించారు. ఇదే తరహాలో బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ గా తూము పద్మాశరత్ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ గా ఇలియాస్ అలీని, ఆర్మూర్ లో మున్సిపల్ చైర్ పర్సన్ గా లహరి స్వామి, వైస్ చైర్ పర్సన్ గా కాటిపల్లి వెంకట్ రెడ్డిని, భీంగల్ లో మున్సిపల్ చైర్ పర్సన్ గా బి.నాగమణి స్వామి, వైస్ చైర్ పర్సన్ గా లతలను ఎన్నుకున్నారు. మేయర్/డిప్యూటీ మేయర్, చైర్ పర్సన్/ వైస్ చైర్ పర్సన్ ల ఎన్నికను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా మున్సిపల్ కార్యాలయాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద అదనపు డీ.సీ.పీ బస్వారెడ్డి, ఏ.సీ.పీ ప్రకాష్ ఇతర పోలీసు అధికారులు బందోబస్తును పర్యవేక్షించారు.

# టెక్నాలజీ సాయంతో ప్రజలకు సేవలు

### 2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్డీపీగా రాష్ట్రం

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు 'స్వర్ణాంధ్ర-2047' విజన్‌పై బిల్ గేట్స్‌కు సమగ్రమైన ప్రజెంటేషన్ ఇచ్చారు. 2047 నాటికి రాష్ట్రానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను వివరించారు. రాష్ట్ర జీఎస్డీపీని ప్రస్తుత 180 బిలియన్ డాలర్ల నుంచి 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చడం, తలసరి ఆదాయాన్ని 3,400 డాలర్ల నుంచి 42,000 డాలర్లకు పెంచడం, ఎగుమతులను 20.7 బిలియన్ డాలర్ల నుంచి 450 బిలియన్ డాలర్లకు వృద్ధి చేయడం వంటి లక్ష్యాలను పేర్కొన్నారు. అలాగే నిరుద్యోగాన్ని 2 శాతానికి తగ్గించడం, మహిళా కార్మికుల భాగస్వామ్యాన్ని 80 శాతానికి పెంచడం, సంపూర్ణ అక్షరాస్యత సాధించడం వంటివి తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని స్పష్టం చేశారు.

### విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యం

రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 13.4 లక్షల మంది విద్యార్థుల కోసం ఓఆర్ఎఫ్ టూల్ వినియోగిస్తున్నామని చెప్పారు. వ్యవసాయంలో ఏఐ ద్వారా రైతులకు సాగు సలహాలు అందించడం, డ్రోన్లు వంటి యంత్రాలను అద్దెకు అందుబాటులో ఉంచడం వంటి కార్యక్రమాలను వివరించారు. తెగుళ్లపై ముందస్తు హెచ్చరికలతో రైతులను నష్టాల నుంచి కాపాడుతున్నామని తెలిపారు. గోధార్ యాప్‌తో పశువుల ఆరోగ్య సంరక్షణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

### జూలై కల్లా రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'

రాష్ట్ర వైద్య రంగంలో విప్లవాత్మక మార్పుగా భావిస్తున్న 'సంజీవని' కార్యక్రమంపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా వివరించారు. కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైందని, ఇప్పటికే 2.9 లక్షల మందికి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 5.2 కోట్ల ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా జూలై 2026 నాటికి ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ 'ఏఐ డాక్టర్' సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

### బిల్‌గేట్స్‌తో మంత్రుల ఇంటరాక్షన్

ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్ పలు అంశాలపై బిల్ గేట్స్‌ను ప్రశ్నలు అడిగారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ ఏర్పాటు ఆలోచనకు కారణమేంటని పయ్యావుల అడగ్గా నాడు చంద్రబాబు ఐటీని ప్రోత్సహించడం వల్ల హైదరాబాద్‌కు చెందిన టెక్ నిపుణులు తమ వద్ద ఎక్కువగా ఉండేవారని, వారి సూచన మేరకే అక్కడ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని బిల్ గేట్స్ వివరించారు. ఏఐ ద్వారా ఆరోగ్య సేవలను మారుమూల ప్రాంతాలకు కూడా సమర్థవంతంగా అందించవచ్చని మంత్రి సత్యకుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఏఐ రాకతో ఉద్యోగాలను పునర్నిర్వచించాల్సిన అవసరం ఉందని, ఈ అంశంపై ఢిల్లీలో జరిగే సమ్మిట్‌లో చర్చిస్తామని ఆయన తెలిపారు.

# పెళ్లికి ముందే ఎవరినీ నమ్మొద్దు

జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ల ధర్మాసనం విచారించింది.నిందితుడి బెయిల్ కేసులో భాగంగా ఫిర్యాదుదారురాలిని.. దుబాయ్ కు ఎందుకు వెళ్లావు, అక్కడ శారీరక సంబంధం ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. "అంగీకారం ఉన్నప్పటికీ, మేము పాతకాలపు వారమై ఉండవచ్చు, కానీ వివాహానికి ముందు అబ్బాయి, అమ్మాయి పూర్తిగా తెలియని వ్యక్తులు. పెళ్లికి ముందు శారీరక సంబంధాలలో జాగ్రత్తగా ఉండాలి" అని పీటీఐ ధర్మాసనం వ్యాఖ్యలను ఉటంకించింది. జస్టిస్ నాగరత్న ఇంకా, "వారి సంబంధం ఎంత ఉన్నా, వివాహానికి ముందు శారీరక సంబంధాలలో ఎలా నిమగ్నమవుతారో మాకు అర్థం కావడం లేదు. మేము పాతకాలపు వారమై ఉండవచ్చు, కానీ మీరు చాలా జాగ్రత్తగా ఉండాలి, పెళ్లికి ముందు ఎవరినీ నమ్మొద్దు" అని స్పష్టం చేశారు. మహిళ న్యాయవాది వాదన ప్రకారం, 2022లో మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ ద్వారా వీరిద్దరు పరిచయం అయ్యారు. నిందితుడు పెళ్లి హామీతో ఢిల్లీలో పలుమార్లు, ఆపై దుబాయ్‌లో ఆమెతో శారీరక సంబంధం పెట్టుకున్నాడు.ఈ వాదనపై ధర్మాసనం స్పందిస్తూ, "ఆమె అంత కఠినంగా ఉంటే, వివాహానికి ముందే అక్కడికి వెళ్లరాదు. మేము వారిని మధ్యవర్తిత్వానికి పంపుతాము. అంగీకార సంబంధం ఉన్నప్పుడు విచారణ జరిపి శిక్షించాల్సిన కేసులు ఇవి కావు" అని వ్యాఖ్యానించింది. ఫిర్యాదులో, నిందితుడు ఆమెను దుబాయ్‌కి ఒప్పించి, తప్పుడు పెళ్లి హామీతో శారీరక సంబంధాలు పెట్టుకున్నాడని మహిళ ఆరోపించింది. సమ్మతి లేకుండా సన్నిహిత వీడియోలు తీసి, ప్రచారం చేస్తానని బెదిరించినట్లు పేర్కొంది. జనవరి 2024లో అతను పంజాబ్ లో వేరొక మహిళను పెళ్లి చేసుకున్నట్లు తర్వాత ఆమెకు తెలిసింది. ట్రయల్, ఢిల్లీ హైకోర్టులు నిందితుడి బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించాయి. అతను అప్పటికే వివాహితుడై, జనవరి 2024లో మళ్లీ పెళ్లి చేసుకున్నందున, పెళ్లి హామీ మొదటి నుంచీ అబద్ధమేనని హైకోర్టు వ్యాఖ్యానించింది. దీంతో నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు నిందితుడు మహిళకు నష్టపరిహారం చెల్లింపుపై జస్టిస్ నాగరత్న సూచించారు. ధర్మాసనం మహిళ న్యాయవాదిని రాజీ సెటిల్‌మెంట్ అవకాశాలను పరిశీలించమని కోరింది. ఇరుపక్షాల వాదనలు వినేందుకు కేసును బుధవారానికి వాయిదా వేశారు.

# జనసేనలో మూడు రకాల కార్యకర్తలు

ప్రాథమిక సభ్యత్వం తీసుకున్న వారు. రెండవ కేటగిరీకి చెందిన వారిని సాధక్ అని పిలుస్తారు. వీరు కేవలం సభ్యులుగానే కాకుండా, పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తూ, పార్టీ ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే క్రియాశీలక పాత్ర పోషిస్తారు. ఇక మూడవ కేటగిరీలోకి ప్రధాతలు వస్తారు. వీరు పార్టీకి వివిధ రూపాల్లో ఆర్థికంగా లేదా మేధోపరంగా అండగా నిలుస్తూ, నాయకత్వ బాధ్యతలు చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేస్తారు.సభ్యత్వ నమోదు ప్రక్రియను పారదర్శకంగా మరియు సులభంగా నిర్వహించేందుకు జనసేన పార్టీ డిజిటల్ పద్ధతులను అవలంబిస్తోంది. ప్రతి సభ్యుని వివరాలను ఆన్‌లైన్ డేటాబేస్‌లో నిక్షిప్తం చేయడం ద్వారా, భవిష్యత్తులో వారికి ఇన్సూరెన్స్ వంటి ప్రయోజనాలను అందించాలని పార్టీ భావిస్తోంది. ముఖ్యంగా యువతను ఈ ఉద్యమి-సాధక్-ప్రధాత ' విధానం వైపు ఆకర్షించడం ద్వారా పార్టీలో జవాబుదారీతనం పెరుగుతుందని నాయకత్వం ఆశిస్తోంది.ఏపీలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ప్రతి గ్రామం, వార్డులో జనసేన జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోంది. సాధారణ సభ్యుల నుండి నాయకుల వరకు వారి పనితీరు , అంకితభావాన్ని బట్టి ఈ వర్గీకరణలో గుర్తింపు లభిస్తుంది. ఈ నూతన విధానం ద్వారా పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపడంతో పాటు, క్రమశిక్షణతో కూడిన రాజకీయ వ్యవస్థను నిర్మించాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు.

# హంగ్ మున్సిపాలిటీల్లో వీడని చిక్కుముడి

ఎప్పుడు ఛైర్మన్ ఎన్నిక నిర్వహిస్తారు అనేది మాత్రం ఇంకా ఎన్నికల అధికారులు క్లారిటీ ఇవ్వలేదు. ఇక నేడు ఈ ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది.ఇక రాష్ట్రంలో సంచలనం రేపిన జనగామ మున్సిపాలిటీలో చిత్రమైన పరిస్థితి నెలకొంది. జనగామలోని 30 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ 12 వార్న?ల్లో విజయం సాధించగా దాని మిత్రపక్షమైన సీపీఎం ఒక వార్డును దక్కించుకుంది.

ఇక ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు కూడా 13 సీట్లలో గెలిచింది. మరో నలుగురు ఇండిపెండెంట్లు కూడా గెలిచారు. ఇక ఎక్స్ అఫీషియో సభ్యులుగా కాంగ్రెస్ నేత, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ నేత, జనగామ సిట్టింగ్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఓటు నమోదు చేసుకున్నారు. దీంతో మళ్లీ ఇరుపార్టీలకు సమానంగా చెరో 14 ఓట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు దృష్టి మొత్తం ఇండిపెండెంట్ కౌన్సిలర్లపై పడింది. నలుగురు స్వతంత్ర అభ్యర్థుల్లో కాంగ్రెస్‌కు ఇద్దరు, బీఆర్ఎస్‌కు ఇద్దరు మద్దతు తెలుపుతున్నట్లు ప్రచారం జరగడంతో జనగామ మున్సిపల్ రాజకీయాలు మరింత ఉత్కంఠను రేపుతున్నాయి.

# కాంగ్రెస్ పార్టీవి అరాచక విధానాలు

పట్టణాల్లో అభ్యర్థులను కిడ్నాప్ చేసే ప్రయత్నం చేయడం కాంగ్రెస్ 'గుండా రాజ్యానికి' అద్దం పడుతోందని ఆరోపించారు.స్వయంగా అధికారులు, పోలీసులు అధికార పార్టీ నేతలతో చేతులు కలిపి ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కారని కేటీఆర్ మండిపడ్డారు. మంత్రులు, ఎమ్మెల్యేలే నేరుగా అక్రమ పద్ధతుల్లో ఛైర్మన్ల ఎంపిక ప్రక్రియలో తలదూర్చడం ఏమిటని ప్రశ్నించారు. వారు ఎక్స్ అఫీషియో ఓట్ల పేరుతో దొంగ ఓట్లను నమోదు చేసుకొన్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చని పేర్కొన్నారు.

మున్సిపాలిటీల్లో జరుగుతున్న ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎంపికలో దౌర్జన్యాలు జరిగాయని ఆరోపించారు. అనేక చోట్ల కాంగ్రెస్ నాయకులు పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసి బెదిరింపులు, పార్టీ మార్పులు, దాడులకు పాల్పడ్డారని అన్నారు. పలు పట్టణాల్లో బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలపై కాంగ్రెస్ గూండాలు దాడులు చేశారని వీటిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.పట్టపగలు పోలీసుల సమక్షంలోనే గెలిచిన ప్రజాప్రతినిధులను అడ్డుకుంటున్నా స్పందించకుండా ఉన్న వారి తీరును చూస్తే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంతలా దిగజారాయో అర్థమవుతుందన్నారు.

వెంటనే రాష్ట్ర డీజీపీ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని, కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కోరం ఉన్న చోట్ల కూడా కేవలం అధికార పార్టీ ఒత్తిడికి తలొగ్గి ఎన్నికలను వాయిదా వేయడం ఎన్నికల సంఘం పనితీరుపై మాయని మచ్చగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించి ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

అక్రమ కిడ్నాప్‌లు, దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి, ప్రజాస్వామ్య పరిరక్షణకు పూనుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ తన క్రిమినల్ మెంటాలిటీతో, గూండాల బలంతో ప్రజల ఆకాంక్షలను, బీఆర్ఎస్ పోరాటాలను ఆపలేదని హెచ్చరించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని సాగిస్తున్న ఈ అరాచకానికి, గూండాయిజానికి రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని కేటీఆర్ అన్నారు.

# కరీంనగర్ కార్పొరేషన్‌పై కాషాయ జెండా

రంగంలోకి దిగింది. కేంద్రమంత్రి బండి సంజయ్ నేతృత్వంలో పలువురు ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల నేతలు బీజేపీ కండువా కప్పుకోగా ఆ తర్వాత మాట మార్చారు. ఇక కరీంనగర్ మేయర్ పీఠం రేసులో తాము కూడా ఉన్నామని కాంగ్రెస్ పార్టీ కూడా ప్రకటించడంతో తీవ్ర సంచలనంగా మారింది. మేయర్ ఎన్నిక సమయానికి ఏదైనా జరగొచ్చని స్వయంగా మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలు చేయడం ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, ఇండిపెండెంట్లు కలిసి ఎలాగైనా కరీంనగర్ కార్పొరేషన్‌ను దక్కించుకోవాలని చక్రం తిప్పినా అది ఫలించలేదు. ఈ నేపథ్యంలోనే మేయర్ ఎన్నిక పూర్తయ్యే వరకు ఏం జరుగుతుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అయితే తాజాగా జరిగిన కరీంనగర్ మేయర్ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. కరీంనగర్ మేయర్‌గా బీజేపీకి చెందిన కొలగాని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కొలగాని శ్రీనివాస్‌కు 34 మంది కార్పొరేటర్లు మద్దతు ప్రకటించారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ బరిలోకి దింపిన మేయర్ అభ్యర్థికి కేవలం 21 మంది కార్పొరేటర్ల మద్దతే లభించింది. ఈ ఎన్నికలో బీఆర్ఎస్ తటస్థంగా వ్యవహరించడంతో కరీంనగర్ మేయర్ పీఠం కమలదళం వశమైంది. ఇక డిప్యూటీ మేయర్‌గా బీజేపీకి చెందిన సునీల్‌రావు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ దక్కించుకోవడంలో కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యూహాత్మక ఎత్తుగడలు వేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌లోని మొత్తం 66 డివిజన్లకు గాను బీజేపీ 30 డివిజన్లలో గెలిచింది. అయితే మేయర్‌ను ఎన్నుకునే ప్రక్రియకు కొద్దిసేపటి ముందే తాము ఈ మేయర్ ఎన్నికకు దూరంగా ఉంటున్నట్లు బీఆర్ఎస్ ప్రకటించడంతో బీజేపీకి మార్గం సుగమం అయింది. బీఆర్ఎస్ పార్టీ తరఫున 9 మంది కార్పొరేటర్లు విజయం సాధించారు.

# మా గ్రామాలూ మాకిచ్చేయండి

ప్రాజెక్టుతోపాటు పలు రైల్వే లైన్లు, నేషనల్ హైవేలపై చంద్రబాబుతో తుమ్మల చర్చించారు. ఏలూరు-కొత్తగూడెం, జగ్గయ్యపేట జాతీయ రహదారి పనులను వేగంగా పూర్తి చేయడం కోసం చొరవ చూపాలని పేర్కొన్నారు.భద్రాచలం అభివృద్ధి చెందడంలో ఆ 5 గ్రామాలు చాలా కీలకమని.. చంద్రబాబుకు తుమ్మల వివరించారు. ఈ సమస్యను పరిష్కరించడానికి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పురుషోత్తపట్నం, కన్నాయిగూడెం, ఉష్ణ గుండాల, ఎటపాక, పిచుకలపాడు గ్రామాలను తెలంగాణలో కలపాల్సిన అవసరం ఉందని మంత్రి తుమ్మల గతంలోనే కేంద్ర హోం శాఖకు లేఖ రాయడం గమనార్హం. భద్రాచలం పట్టణం ఒక్కటి మాత్రమే తెలంగాణ భూభాగంలోనే ఉండగా.. మిగిలిన గ్రామాలు ఏపీలోకి వెళ్లాయని పేర్కొన్నారు. ఆ ఐదు గ్రామాల ఆవాసాలు భౌగోళికంగా రెండు వైపులా తెలంగాణ భూముల మధ్య ఉన్నాయని వెల్లడించారు. గోదావరి నది, రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాలు ఉండటంతో.. పాలన పరంగా కూడా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయనే వాదన ఉందని గుర్తు చేశారు.

# కాంగ్రెస్‌కు గట్టి షాక్ ఇచ్చిన ఫిరాయింపు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆయన బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేశారు. ముఖ్యంగా ఇస్నాపూర్‌లో తన ఎక్స్ అఫీషియో ఓటుతో బీఆర్ఎస్ చైర్మన్‌ను గెలిపించుకున్న అనంతరం, తనదైన శైలిలో బుల్లెట్ దిగిందా లేదా? అంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.

### హరీష్ రావుకు అత్యంత సన్నిహిత ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

బీఆర్ఎస్ తరపున మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మహిపాల్ రెడ్డి, నియోజకవర్గ అభివృద్ధి పేరుతో 2024 జూలైలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆ సమయంలో ఆయనపై ఈడీ దాడులు జరిగాయి. పలు రకాల సమస్యలు రావడంతో ఆయన పార్టీ మారారు. మొదట్లో బీజేపీలో చేరుతారన్న ప్రచారం జరిగినా చివరికి కాంగ్రెస్ లోనే చేరారు. అయితే కాంగ్రెస్‌లో చేరి తాను పెద్ద తప్పటడుగు వేశానని, ఆ పార్టీ వల్ల తనకు లేదా నియోజకవర్గానికి వెంట్రుక వాసి కూడా ప్రయోజనం కలగలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు గుర్తింపునిచ్చింది గులాబీ జెండానేనని ఆయన బహిరంగంగానే ప్రకటించుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థుల్ని గెలిపించడానికి ఆయన ప్రచారం చేశారు, పని చేశారు కానీ ఆ పార్టీలో మళ్లీ అధికారికంగా చేరలేదు.

### మహిపాల్ రెడ్డి చేరికను వ్యతిరేకించిన స్థానిక కాంగ్రెస్ నేతలు

మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడాన్ని మొదటి నుంచి స్థానిక కాంగ్రెస్ సీనియర్ నేతలు కాటా శ్రీనివాస్ గౌడ్ , నీలం మధు ముదిరాజ్ మొదటి నుంచీ వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడి, అక్కడ సీఎం రేవంత్ రెడ్డి ఫోటో లేదని రగడ చేయడం వంటి ఘటనలు ఆయనపై ఉన్న వ్యతిరేకతను స్పష్టం చేశాయి. ఈ వర్గపోరు కారణంగానే మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో ఇమడలేక తిరిగి బీఆర్ఎస్ బాట పట్టారు.

### బీఆర్ఎస్ పార్టీ మళ్లీ మహిపాల్ రెడ్డిని స్వాగతిస్తుందా?

మహిపాల్ రెడ్డి సోదరుడు ఇప్పటికే బీఆర్ఎస్‌లో చేరడం, స్వయంగా ఎమ్మెల్యేనే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునివ్వడం వంటి పరిణామాలు ఆయన పునరాగమనాన్ని సూచిస్తున్నాయి. అయితే, మున్సిపాలిటీల్లో పార్టీని గెలిపించినప్పటికీ, ఆయనను మళ్లీ అధికారికంగా చేర్చుకునే విషయంలో బీఆర్ఎస్ అధిష్టానం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. పార్టీ కేడర్ సెంటిమెంట్‌ను దృష్టిలో ఉంచుకుని వేచి చూసే ధోరణిని అవలంబిస్తోంది. ప్రస్తుతం పటాన్ చెరు నియోజకవర్గానికి ఆదర్శ్ రెడ్డిని ఇంచార్జ్ గా నియమించారు. ఇటీవలి కాలంలో ఆయనే పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ మహిపాల్ రెడ్డిని చేర్చుకుంటే ఆయన అసంతృప్తికి గురయ్యే అవకాశం ఉంది.

## మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజనీర్ కార్మికులకు

# వేతనాలు పెంచాలి

**మంథని** మంథని మున్సిపల్ పాలకవర్గం సోమవారం కొలువుదీరింది. ఈనెల 13న జరిగిన మంథని మున్సిపల్ ఎన్నికల్లో 13 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ 11 మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోగా టిఆర్ఎస్ పార్టీ ఒకటి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఒక స్థానాల్లో గెలుపొందాయి. మున్సిపల్ పీఠం బీసీ జనరల్ కు రిజర్వు కావడంతో కాంగ్రెస్ పార్టీ నుండి 11వ వార్డు కౌన్సిలర్ గా గెలిచిన ఓడ్నాల శ్రీనివాస్ చైర్మన్ గా, కాంగ్రెస్ పార్టీ నుండి గెలుపొందిన 5వ వార్డు కౌన్సిలర్ ముస్కుల సురేందర్ రెడ్డి వైస్ చైర్మన్ గా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అండదండలతో ఎన్నికయ్యారు. మంథని మున్సిపాలిటీకి ఎన్నికైన 13 మంది కౌన్సిలర్లు మంథని మున్సిపల్ కార్యాలయానికి సోమవారం ఉదయం చేరుకున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు సంబంధించి, కౌన్సిలర్ల ప్రమాణస్వీకారాలకు సంబంధించి మంథని ఆర్డీవో సురేష్ ను ప్రొసీడింగ్ అధికారి గా నియమించారు.ప్రత్యేక గదిలో ఏర్పాటు చేసిన సమావేశంలో కౌన్సిలర్లకు ఏర్పాటు చేసిన సీట్లలో వారిని కూర్చుండబెట్టి తెలుగు అక్షర క్రమంలో కౌన్సిలర్లుగా ప్రమాణస్వీకారం చేయించారు. మొదటగా 1వ వార్డు సభ్యులు కుర్ర లింగయ్య,7వ వార్డు సభ్యురాలు జంబోజు శ్రీమతి సమ్మయ్య, 2వ వార్డు సభ్యులు నూకల కమల్,10వ వార్డు సభ్యులు పెంటరి రాజేందర్,9వ వార్డు సభ్యురాలు మారుపాక నిహారిక,8వ వార్డు సభ్యురాలు లైశెట్టి రజిత రాజు,13వ వార్డు సభ్యులు వంశీధర్ ఎల్లంకి,12వ వార్డు సభ్యురాలు వేముల లక్ష్మి సమ్మయ్య,11వ వార్డు సభ్యులువోడ్నాల శ్రీనివాస్,5వ వార్డు సభ్యులుసయేందర్ రెడ్డి ముస్కుల,4వ వార్డు సభ్యురాలు స్రవంతి మద్దికట్ల రమేష్,3వ వార్డు సభ్యులు మాచీడి రాజు గౌడ్, చివరగా6వ వార్డు సభ్యురాలు పోతరబోయిన శ్రీలత క్రాంతి కుమార్ లు కౌన్సిలర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం చైర్మన్ పదవికి నామినేషన్లను ఆహ్వానించగా బీసీ అభ్యర్థి ఓడ్నాల శ్రీనివాస్ ఒక్కరే నామినేషన్ వేయగా కాంగ్రెస్ పార్టీ ఆదేశానుసారం కౌన్సిలర్లు మద్దికట్ల స్రవంతి, మారుపాక నిహారిక లు ప్రతిపాదించారు. వైస్ చైర్మన్ పదవికి నామినేషన్లను ఆహ్వానించగా సహేందర్ ముస్కుల ఒకరే నామినేషన్ దాఖలు చేశారు.

ఈయనను కౌన్సిలర్లు కుర్ర లింగయ్య, పెంటరి రాజు లు ప్రతిపాదించారు. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో ఓడ్నాల శ్రీనివాస్ చైర్మన్ గా, ముస్కుల సహేందర్ రెడ్డిని వైస్ చైర్మన్ గా ఎన్నికైనట్లుమంథని ఆర్డీవో,ప్రొసీడింగ్ అధికారి సురేష్, మంథని మున్సిపల్ కమిషనర్ ఎన్ మనోహర్ లు ప్రకటించారు. అనంతరం వీరితో పదవి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కౌన్సిలర్లందర్నీ ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రూప్ ఫోటోకు ఫోజులు ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి లు మాట్లాడుతూ తమ పై నమ్మకంతో తమను చైర్మన్ గా, వైస్ చైర్మన్ గా ఎన్నుకున్న కౌన్సిలర్లకు, సహకరించిన మంత్రి శ్రీధర్ బాబుకు యువ నాయకుడు శ్రీను బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో రాబోయే రోజుల్లో మంథని పట్టణాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కష్టపడతా మని, మంథని పట్టణ ప్రజలు 13 కౌన్సిలర్ లకు గాను 11 మంది కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ లను గెలిపించినందుకు ప్రజల కు కృతజ్ఞతలు తెలిపారు. మంథని మున్సిపల్ కార్యాలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మంథని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# 'ప్రజారోగ్య అత్యవసర కార్యకలాపాల కేంద్రం' సిద్ధం

**- అంటు వ్యాధులు, ఫుడ్ పాయిజనింగ్ వంటి అవుట్ బ్రేక్స్, విపత్తులు వంటి ఘటనలపై నిరంతర నిఘా**
**- బాధితులకు సత్వరం సేవలు అందేలా సదరు శాఖలతో సమన్వయశీ**
**-హైస్పీడ్ డేటా ట్రాన్సఫర్, ఇతర అత్యాధునిక సౌకర్యాల కల్పన- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**







**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో మంగళగిరి కేంద్రంగా 'ప్రజారోగ్య అత్యవసర సేవల కేంద్రం' (పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్) సిద్ధమైశీది. ప్రకృతి వైపరీత్యాలు జరిగినపుడు, అంటు వ్యాధులు ( జ్వరాలు డయేరియా, ఇతర) ప్రబలినప్పుడు, ఫుడ్ పాయిజినింగ్ కేసులు ఎక్కువగా ఉన్నపుడు, కొవిడ్ లాంటి అసా అసాధారణ పరిస్థితులు ఉత్పన్నమయ్యే సందర్భాల్లో తీసుకోవాల్సిన ముందస్తు ఘటనల ఆధారంగా తీసుకోవాల్సిన చర్యలను వైద్య, ఆరోగ్య శాఖ ఈ కమాండ్ కుట్రోల్ సెంటర్ ద్వారా తీసుకుంటుంది. ఈ కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ, డిజాస్టర్ మేనేజ్మెంటు, ఫైరింగ్, పోలీసు, ఇతర శాఖల సమాచారం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటుంది. వాతావరణం కేంద్రం నుంచి వచ్చే హెచ్చరికలను కూడా. పరిగణనలోనికి తీసుకుని కూడా ఈ కేంద్రంలో ఉండే వారు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటారు. విపత్తుల నిర్వహణ శాఖలో 'ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ పనిచేస్తోంది.

వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ఏరాటవుతున్న ఈ కొత్త కేంద్రం అత్యవసర సమయాల్లో వైద్య సేవలను బాధితులకు ఎలా అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తుంది. ముఖ్యంగా వాచ్, రెసాన్స్ అలర్ట్ సూత్రాల ఆధారంగా ఈ కేంద్రం కార్యకలాపాలు కొనసాగుతాయి వైద్య ఆరోగ్య శాఖలో వివిధ విభాగాలు, జిల్లా అధికారుల మధ్య సమన్వయం, ప్రభుత్వ శాఖలను భాగస్వామ్యం చేయడం, ప్రణాళికలు రూపొందించడం, అమలుచేయడం వంటి చర్యలు ఈ కమాండ్ కంట్రోల్ కేంద్రంగా కొనసాగుతాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ అనుసంధానంగా ఉంటుందని తెలిపారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ సెంటర్ కార్యకర్తలు కొనసాగుతాయి. కేంద్ర ప్రభుత్వం రూ. 5 కోట్లతో ఈ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుశీది.

### అత్యాధునిక సౌకర్యాలు..

ఈ కేంద్రంలో స్టూడియోతోపాటు హెస్పీడ్ డేటా ట్రాన్స్ పర్, వాయిస్ అండ్ వీడియో కాన్ఫరెన్సింగ్ వంటి సౌకర్యాలను సమకూరుస్తున్నారు. గత ఏడాది జనవరి 21న రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్తో జరిగిన ఒప్పందాన్ని అనుసరించి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంగళగిరిలోని రాష్ట్ర వైద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలోని మూడో అంతస్తులో ఈ కమాండ్ కంట్రోల్ రూము రూపుదిద్దుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం ఎంపికచేసిన 'హెచ్ఎల్ఎల్ ఏజెన్సీ ద్వారా అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటయ్యే ఈ కేంద్రాన్ని త్వరలో ప్రారంభించనున్నారు. రూ.5 కోట్లతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద ఈ కమాండ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం తొలివిడత కింద 15 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఎంపికచేసింది.

# గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఏపీకి కొత్త దశ-దిశ

**- ప్రజా సాధికారత, సంపద సృష్టి లక్ష్యంగా పనిచేస్తున్నాం - బిల్ గేట్స్‌తో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**
**- స్వర్ణాంధ్ర లక్ష్యాలు, పాలనా విధానాలపై సీఎం ప్రజెంటేషన్ - కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలుపై బిల్ గేట్స్ ప్రశంసలు**
**- డిజిటల్ విప్లవంలో చంద్రబాబుది కీలక పాత్రగా గేట్స్ కితాబు**



**అమరావతి(ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దశ-దిశ ఏర్పడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ అమరావతి రాక చారిత్రాత్మకంగా నిలుస్తుందని, ఆంధ్రప్రదేశ్ ప్రజల సాధికారతకు ఇది దోహదపడుతుందని ముఖ్యమంత్రి అన్నారు. సోమవారం బిల్ గేట్స్ అమరావతి పర్యటనలో భాగంగా సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి ముందుగా గేట్స్, ఆయన బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బిల్ గేట్స్‌తో తన అనుబంధాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. 1997లో మొదటిసారి తాను బిల్ గేట్స్‌ను కలిశానని హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించానని మైక్రోసాఫ్ట్ రాకతో ఇప్పుడు హైదరాబాద్ ఐటీ రంగంలో మేటిగా నిలబడిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తాను ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం పనిచేస్తున్నానని ముఖ్యమంత్రి చెప్పారు.
ఏపీలో వనరులకు లోటు లేదని, సంపద సృష్టి జరగాల్సి ఉందన్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో 2047 నాటికి రాష్ట్రాన్నినెంబర్‌వన్ చేస్తామనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

### చంద్రబాబు విజనరీ అని ఆనాడే తెలిసింది

సమావేశంలో మాట్లాడిన బిల్ గేట్స్ డిజిటల్ విప్లవానికి భారత్‌లో బలమైన పునాదులు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. భారతదేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారని కితాబిచ్చారు. తాను మొదటిసారి చంద్రబాబును కలిసినప్పుడు ఆయన ఆలోచనల్లో ముందుచూపు ఉందనే విషయాన్ని ఆనాడే గ్రహించినట్టు వెల్లడించారు. ఈ విషయంలో నాటి సింగపూర్ ప్రధాని మాత్రమే చంద్రబాబుకు కొంత దగ్గరగా ఉన్నారని చెప్పారు. గేట్స్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాల్లో ఆరోగ్య రంగానికి చెందిన ప్రాజెక్టులే మెజార్టీ ప్రాజెక్టులని తెలిపారు. ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నది తన ఆశయమన్నారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉందని అభినందించారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకోవడానికి, వారికి సరైన రీతిలో తగిన స్థాయిలో విద్యా బోధన చేయడానికి ఏఐ సహాయపడుతుందన్నారు. విద్యారంగంలో మార్పు తీసుకురావడానికి ఏఐ-టెక్నాలజీ ఉపయోగపడుతుందని చెప్పిన బిల్ గేట్స్, వ్యవసాయం రంగం చాలా ముఖ్యమైనదిగా అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ సాయంతో ఏపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడం టెక్నాలజీని రైతులకు అందించేందుకు ఏఐను వ్యవసాయంతో ఇంటిగ్రేట్ చేస్తూ కృషి చేయడాన్ని అభినందించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వ్యవసాయంలో ఏఐని ఇంతలా వినియోగంచడం లేదని కానీ ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో ముందుండటం మంచి పరిణామమని చెప్పారు. విపత్తుల నిర్వహణ కోసం టెక్నాలజీతో ముందస్తు అంచనాలు వేసి... ప్రాణ నష్టం జరగ్గకుండా జాగ్రత్తలు తీసుకునే వ్యవస్థ ఏర్పాటు చేయడం బాగుందన్నారు. చంద్రబాబు తనకు గుడ్ ఓల్డ్ ఫ్రెండ్ అని సమావేశంలో బిల్ గేట్స్ సరదాగా వ్యాఖ్యానించారు.

### పది సూత్రాలతో స్వర్ణాంధ్ర-2047 సాకారం

స్వర్ణాంధ్ర 2047 విజన్, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పాలసీలు, లక్ష్యాలు, కార్యక్రమాలపై బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి ప్రజెంటేషన్ ఇచ్చారు. జీరో పావర్టీ, సంపూర్ణ స్థాయి నైపుణ్యాభివృద్ధి, నీటి భద్రత, రైతు-అగ్రి టెక్, ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్, ఎనర్జీ-ఫ్యూయల్, ప్రోడక్ట్ పర్ఫెక్షన్, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్ ఈ 10 సూత్రాలతో స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అనేది ఏపీ ప్రభుత్వ విధానమని దీనికి ఆధార్ ధృవీకరణ, వ్యక్తిగత, కుటుంబ డేటా లేక్, కుటుంబ సమాచారం, రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వ సమగ్ర డేటా, అవేర్ ద్వారా రియల్ టైమ్ డేటా సేకరణ, వాట్సాప్ గవర్నెన్స్, డిజి వెరిఫై వంటి అప్లికేషన్ల వినియోగం ద్వారా భవిష్యత్ కోసం పూర్తి సన్నద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి అన్నారు. టెక్నాలజీ ఆధారిత థీమాటిక్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే క్వాంటం వ్యాలీ-డిజైన్ - ఫౌండ్రీగా అమరావతి, డేటా-ఏఐ సిటీగా విశాఖ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా కాకినాడ, డ్రోన్ సిటీగా ఓర్వకల్లు, ఎలక్ట్రానిక్స్-ఏరో సిటీగా లేపాక్షి, ఎలక్ట్రానిక్స్-స్పేస్ సిటీగా తిరుపతిని అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. రాష్ట్రంలో మొత్తం 10 రంగాలు, 30 ప్రభుత్వ విభాగాల్లో ఏఐని వినియోగిస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. 98 ఏఐ యూజ్ కేసులు, 43 హ్యాకథాన్లు ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నాయన్నారు. మొత్తం 7 డేటా లేక్ ప్రాజెక్టులు ప్రారంభించినట్టు తెలిపారు.



### 2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్డీపీగా రాష్ట్రం

స్వర్ణాంధ్ర-2047 నాటికి ముఖ్య లక్ష్యాలు నిర్దేశించుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 'ప్రస్తుతం 180 బిలియన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఎకానమీని 2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్డీపీగా తీర్చిదిద్దడం, తలసరి ఆదాయం ప్రస్తుతం 3,400 డాలర్లు ఉండగా 2047 నాటికి దీనిని 42,000 డాలర్లకు పెంచడం, ఎగుమతులు 20.7 బిలియన్ డాలర్ల నుంచి 450 బిలియన్ డాలర్లకు పెంచడం, నిరుద్యోగితను 4.1 శాతం నుంచి 2 శాతం కన్నా తగ్గించడం, మహిళా కార్మికుల సంఖ్యను 45.8 శాతం 80 శాతానికి పెంచడం, ప్రస్తుతం 72 శాతంగా ఉన్న అక్షరాస్యతను 100 శాతానికి తీసుకువెళ్లడం, 95 శాతం నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉండేలా చూడటం, సగటు ఆయుర్దాయం 85 ఏళ్లు, ఎంఎంఆర్ ప్రతీ లక్ష జననాలకు 5, ఐఎంఆర్ ప్రతీ వెయ్యి జననాలకు 2 కన్నా తగ్గించగలగడం, గర్భిణులలో రక్తహీనత సమస్య, వైద్యంపై వ్యక్తిగత ఖర్చు 5 శాతానికి తగ్గించడమే లక్ష్యం'గా సీఎం చెప్పారు.

### విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యం

విద్యారంగంలో అనుసరిస్తున్న ఆధునిక విధానాల గురించి కూడా ముఖ్యమంత్రి స్పష్టంగా తెలియజేశారు. ఇందుకు గేట్స్ ఫౌండేషన్ అందిస్తున్న సహకారంపైనా సంతోషం వ్యక్తం చేశారు. లిటరసీ-న్యూమరసీపై రాష్ట్ర ప్రభుత్వ దృష్టి పెట్టిందని, 35,000 పాఠశాలల్లో చదువుతున్న 13.4 లక్షల విద్యార్థులకు ఉపకరించేలా ఓఆర్ఎఫ్ టూల్ వినియోగిస్తున్నామని సీఎం చెప్పారు. వ్యవసాయం, అనుబంధ రంగాలను బలోపేతం చేస్తున్నామని చెప్పిన ముఖ్యమంత్రి రైతు సంక్షేమం కోసం సాంకేతిక సాయం తీసుకుంటున్నామని వివరించారు. ఏఐ ద్వారా సాగుకు సలహాలు అందించడమే కాకుండా, డ్రోన్ల సహా వ్యవసాయ యంత్రాలను అద్దెప్రాతిపదికన వినియోగించుకునేలా అందుబాటులో ఉంచామన్నారు. తెగుళ్లు, చీడపీడలపై ముందస్తు హెచ్చరికలు చేయడం ద్వారా రైతులు నష్టపోకుండా కాపాడటం సాధ్యమవుతోందని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను తెలిపారు. గోధార్ ద్వారా పశువుల ఆరోగ్య సంరక్షణ చేపట్టామన్నారు. విద్యుత్-పశుగ్రాసం వినియోగంలో వృధాను తగ్గించగలిగామని చెప్పారు. భూసార పరీక్షలు, మార్కెట్ సలహాలు, సమర్ధ నీటి నిర్వహణ సాగులో పెనుమార్పులు తీసుకువస్తున్నామని వివరించారు.

### జూలై కల్లా రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'

వైద్యరంగంలో తెచ్చిన మార్పులు-సాధించిన ఫలితాలను బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి తెలిపారు. హై లెవెల్ ఎక్స్‌పర్ట్ అడ్వైజరీ గ్రూప్ ఏర్పాటు చేశామన్నారు. డబ్లుహెచ్‌వో, అశోకా యూనివర్సిటీ సహకారంతో నేషనల్ హెల్త్ ఏఐ స్ట్రాటజీ వర్క్‌షాప్ నిర్వహించామన్నారు. యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్, ఏబీడీఎం (ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్) అమలు సహా తక్కువ ఖర్చుకే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 71 లక్షల మందికి 41 పరీక్షల ద్వారా స్క్రీనింగ్ పూర్తి చేశామని చెప్పారు. 'సంజీవని' కార్యక్రమాన్ని సమగ్ర ఆరోగ్య వేదికగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కుప్పంలో ఇప్పటికే సంజీవని పైలట్ ప్రాజెక్టు చేపట్టగా, విజయవంతమైందన్నారు. 2.9 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేయగా, 109 ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 5.2 కోట్ల ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా జూలై 2026 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరికి ఏఐ డాక్టర్‌ను ఇవ్వాలనేది రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు. టీబీ రోగులకు పోషకాహారం అందిస్తున్నామని, ఎన్టీఆర్ హెల్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో డీఎంఐడీసీ స్థాపించామన్నారు. ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టుగా 'అమరావతి స్కూల్ ఆఫ్ బయోడిజైన్' చేపట్టామన్నారు.

### బిల్‌గేట్స్‌తో మంత్రుల ఇంటరాక్షన్

సమావేశంలో పలు అంశాలపై ప్రశ్నలు వేసి మంత్రులు పయ్యావుల, సత్యకుమార్ యాదవ్ గేట్స్ అభిప్రాయాలు తెలుసుకున్నారు. హైదరాబాద్‌లో మైక్రో సాఫ్ట్ సెంటర్ ఏర్పాటు చేయాలనే ఆలోచనకు కారణమేంటని మంత్రి పయ్యావుల అడగ్గా దీనికి బిల్ గేట్స్ ఆసక్తికర సమాధానం చెప్పారు. నాడు చంద్రబాబు ఐటీని ప్రమోట్ చేయడం వల్ల టెక్ నిపుణులు చాలా మంది హైదరాబాద్ నుంచే వచ్చేవారని అన్నారు. అదే సమయంలో చంద్రబాబు మైక్రో సాఫ్ట్ కార్యాలయాన్ని హైదరాబాద్ లో పెట్టాలనే ప్రతిపాదన పెట్టారని బిల్ గేట్స్ తెలిపారు. దీనిపై తమ వద్ద పని చేసే వారి అభిప్రాయం కోరితే హైదరాబాద్ సెంటర్ ఏర్పాటు చేస్తే తాము వెళ్లడానికి సిద్దంగా ఉన్నట్టు చెప్పారని బిల్ గేట్స్ సమావేశంలో వివరించారు. ఇప్పుడు కూడా భారతదేశంలో మైక్రో సాఫ్ట్ కంపెనీల్లో పని చేసే చాలా మంది ఉద్యోగుల్లో హైదరాబాద్ వారే ఎక్కువగా ఉన్నారని బిల్ గేట్స్ అన్నారు. ఇక ఏఐ ద్వారా ఆరోగ్య సేవలు ఏ విధంగా అందించవచ్చని బిల్ గేట్స్‌ను మంత్రి సత్యకుమార్ అడిగారు. ఏఐ టెక్నాలజీతో ఆరోగ్య రంగంలో మెరుగైన సేవలు అందించవచ్చని, నాణ్యమైన, నిపుణుల వైద్య సేవలను మారుమూల ప్రాంతాలకు కూడా అందించే అవకాశం ఉంటుందని గేట్స్ వెల్లడించారు. సీనియర్ ఐఏఎస్ అధికారి బాబు ఏ అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా ఏఐ రాకతో ఉద్యోగాలను పునర్నిర్వచించాల్సిన అవసరం ఉందని బిల్ గేట్స్ అభిప్రాయపడ్డారు. అలాగే ఈ వారం ఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో కూడా ఏఐ వల్ల వచ్చే అవకాశాలు, ఎదురయ్యే సవాళ్ల గురించి ప్రపంచంలోని ఏఐ నిపుణులంతా చర్చిస్తారని గేట్స్ వివరించారు.

## బద్వేలు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో వైభవంగా మహా శివరాత్రి ఉత్సవాలు

**- శివుని దర్శించుకున్న నాయకులు అధికారులు**
**- శివాలయాలకు పోటెత్తిన వేలాది మంది భక్తులు**

**బద్వేలు** బద్వేలు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఆదివారం మహా శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి శివాలయాలకు తెల్లవారుజాము నుంచే వేలాదిమంది భక్తులు వచ్చారు ఎంతో పవిత్రంగా పూజలు చేసి శివునికి కాయ కర్పూరం సమర్పించారు శివాలయాలు చుట్టూ ఎంతో భక్తి శ్రద్ధలతో తిరిగారు లంక మల్లబైరవకోన బ్రహ్మంగారిమఠం మల్లెంకొండేశ్వర స్వామి రూపారం పేట శివాలయాలు భక్తులతో నిండిపోయాయి పతి శివాలయం వద్ద భక్తులకు అన్న ప్రసాదం చేశారు పోరుమామిళ్ల మండలం సిద్ధవరం గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సిద్దేశ్వర స్వామి సిద్దులు క్షేత్రాన్ని మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వారి సతీమణి తులసమ్మతో కలిసి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు సాదర స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, ఎమ్మెల్సీ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొని నియోజకవర్గం ప్రజల శ్రేయస్సు, సుఖసంతోషాలు, సమృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. కార్యక్రమం అనంతరం వేద పండితులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పుణ్యఫలాలు పొందారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బూత్ కన్వీనర్లు సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, జిల్లా పంచాయతీ రాజ్ జనరల్ సెక్రటరీ సిద్ధమూర్తి రాజారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చిత్తా గిరి ప్రణీత్ రెడ్డి, ఉప సర్పంచ్ రమణారెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## ఆహ్లాద వాతావరణంలో నేత్రపర్వంగా రథోత్సవ వేడుకలు

**- పెద్దఎత్తున హాజరై మొక్కులను తీర్చుకున్న భక్తులు.**
**- భక్తులకొరకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు.**



**తుగ్గలి:** మండల పరిధిలోని గల ఉప్పర్లపల్లె గ్రామ సమీపంలోని గల బోడబండ పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ పకీరప్ప గురు స్వాములు,శ్రీ యల్లప్ప గురుస్వాములు మరియు శ్రీ ఆంజనేయులు తాత వారి రథోత్సవ వేడుకలు అశేష జనవాహిని మధ్య ఆహ్లాద వాతావరణంలో నేత్రపర్వంగా సోమవారం రోజున ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉదయం శ్రీ పక్కీరప్ప స్వామి,శ్రీ యల్లప్ప స్వామి,శ్రీ ఆంజనేయులు తాత ఉత్సవమూర్తులు అప్పా నారాయణ స్వామి ఆధ్వర్యమున గంగాస్నానం నిర్వహించారు. అనంతరం పెరవలి గ్రామము గవ్వల గురునాథం,మొలగవెల్లి గ్రామ వాస్తవ్యులు శ్రీ రంగన్న తాత,శ్రీ పక్కీరప్ప తాత భక్తాదులు మరియు హైదరాబాద్ శ్రీరాములు చేత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంధ్యావేళలో నిర్వహించిన శ్రీ పకీరప్ప గురు స్వాములు,శ్రీ యల్లప్ప గురుస్వాములు,శ్రీ ఆంజనేయులు తాత వారి రథోత్సవ వేడుకలకు భక్తులు,ప్రజలు పెద్ద ఎత్తున హాజరై మొక్కులను తీర్చుకున్నారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ధర్మకర్త అప్పా వేణు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ గౌడ్, జొన్నగిరి ఎస్సై మల్లికార్జున తమ పోలీస్ సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి భీమన్న, అప్పా చంద్రశేఖర్,అప్పా నారాయణ స్వామి, నీలా ప్రసాద్,నీలా మనోహర్,సుంకప్ప, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులపై దాడి చేసిన మహిళలు

**రంగారెడ్డి** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్వేల్ లో ఒకే బస్తీకి చెందిన ఇద్దరు వ్యక్తులు గొడవ పడడంతో స్థానికులు 100కి డయల్ చేశారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. శరణ్య, సంగీత అనే మహిళలు ఇద్దరు కలిసి పోలీస్ కానిస్టేబుల్ పై దాడి చేశారు. మహిళా కానిస్టేబుల్ తో పాటు మరో కానిస్టేబుల్ పై ట్యాబ్లో చిత్రీకరిస్తున్న సమయంలో ట్యాబ్ని పగలగొట్టి మహిళా కానిస్టేబుల్ జుట్టు పట్టుకొని దాడి చేస్తున్న స్థానికులు చూసి మొబైల్ ఫోన్ చిత్రీకరించారు పక్కనే ఇల్లు నిర్మాణం చేస్తున్న వారి మా స్థలంలోకి జరిగారని అడగడంతో ఒక్కసారిగా మాటల యుద్ధం తో పాటు గొడవ జరిగింది. గొడవలో రెండు కుటుంబ సభ్యులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నరు.దాడి విషయం రాజేంద్రనగర్ పోలీసులకు మొబైల్ కానిస్టేబుల్ సమాచార అందజేయగానే ఘటన స్థలానికి ఉన్నతాధికారులు చేరుకున్నారు.

## దమ్ముంటే పొత్తు లేకుండా గెలవాలి

**ఖానాపూర్** మీకు దమ్ము, ధైర్యం ఉంటే బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు పెట్టుకోకుండా రండని బీఆర్ఎస్, బీజేపీకి ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సవాల్ విసిరారు. పొత్తు పెట్టుకోకుండా ఖానాపూర్ మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలి. ఖానాపూర్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీనే కైవసం చేసుకుంటుందని అయన అన్నారు.

## ఆ కౌన్సిలర్‌కు పుట్టగతులుండవు

**అమంగల్** బీఆర్ఎస్ పార్టీకి భయపడి ఆమనగల్లో బీజేపీ కాంగ్రెస్ ఒక్కటయ్యారు. దేవుడి మీద ప్రమాణం చేసి పార్టీ మారను అని చెప్పి, పార్టీ మారిన కౌన్సిలర్ పత్య నాయక్కు పుట్టగతులు ఉండవని బీఆర్ ఎస్ నేత ఉప్పాల వెంకటేష్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ 15 వార్డుల్లో ఒక్క వార్డు గెలిచి సిగ్గు లేకుండా మున్సిపాలిటీ కైవసం చేసుకున్నామని ఎలా చెప్తున్నారు, మా బీఆర్ఎస్ ఏడుగురు కౌన్సిలర్లతో రాజీనామా చేయిస్తా, మీకు దమ్ముంటే మీ కౌన్సిలర్లతో రాజీనామా చేయించి మళ్లీ గెలవండి. అసెంబ్లీలో బూతులు తిట్టుకునే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ చైర్మన్ కోసం ఒక్కటయ్యారు. రెండు పార్టీలు చేసిన దౌర్జన్యాన్ని ప్రజలు గమనించారు, వాళ్లే మీకు బుద్ధి చెప్తారు. మాకున్న ఏడుగురు కౌన్సిలర్లతో మిమ్మల్ని నిలదీస్తూనే ఉంటామని అన్నారు.

## బోరున విలపించిన కాంగ్రెస్ కౌన్సిలర్

**పరిగి** పరిగి పోలీస్ స్టేషన్ ముందు కాంగ్రెస్ కౌన్సిలర్ అక్కమ్మ నిరసనకు దిగి, బోరున విలపించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి వైస్ చైర్మన్ పదవి ఇస్తానని చెప్పి మోసం చేశాడని నిరసనకు దిగింది. వైస్ చైర్మన్ పదవి ఇస్తానని బాండ్ పేపర్ మీద రాసిచ్చి రామ్మోహన్ రెడ్డి మాట తప్పాడని బోరున విలపించిఇ. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేసింది.



# ప్రజా తీర్పుతో బీజేపీ ప్రధాన ప్రతిపక్షం

**- భాజపా వేములవాడ పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్**

**- బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గెలిచిన మున్సిపల్ కౌన్సిలర్లకు ఘన సన్మానం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన బీజేపీ కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి నాయకులు రాపెల్లి శ్రీధర్, ప్రతాప రామకృష్ణ హాజరై అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణాధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ, బీజేపీపై నమ్మకం ఉంచిన వేములవాడ ప్రజలు పార్టీని ప్రధాన ప్రతిపక్షంగా నిలబెట్టడం స్వాగతించదగ్గ విషయమన్నారు. మున్సిపల్ సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలకు అండగా నిలుస్తామని, కేంద్ర--రాష్ట్ర పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఇండిపెండెంట్‌లుగా గెలిచిన కొందరు అభ్యర్థులు తర్వాత కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం ఓటర్ల మనోభావాలను దెబ్బతీస్తోందన్నారు. ఒక పార్టీ నుంచి గెలిచిన వ్యక్తులు గెలిచిన కొద్ది గంటల్లోనే పార్టీ మారడం వార్డుల ప్రజల గౌరవానికి విరుద్ధమని విమర్శించారు. ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లు కుమ్మరి శంకర్, కొండల్లేపు ముత్యం, రేగుల రేణుక, బోనాల సాగరిక, శివ, మామిండ్ల అమర లక్ష్మీరాజం, వంగల శీను, మైలారం శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే నాయకులు రేగుల మల్లిఖార్జున్, సంటి మహేష్, రేగుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ గెలుపు సమిష్టి కృషి

**- గాడ్ ఫాదర్ హరీష్ రావు- సలహాలు సూచనలతోనే గెలిచాం**

**బిఆర్ఎస్ పార్టీ పటాన్చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ రెడ్డి**



పటాన్‌చెరు(ప్రశ్న న్యూస్)టిఆర్ఎస్ పార్టీ పటాన్చెరు నియోజకవర్గం కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి తన నివాసంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ముగిసిన మున్సిపల్ ఎన్నికలలో టిఆర్ఎస్ పార్టీ విజయకేతనం ఎగరవేసిన క్రమంలో ఈ పాత్రికేయ సమావేశం నిర్వహించబడింది. పటాన్చెరువు గడ్డ బిఆర్ఎస్ అడ్డ అని ఐదు మున్సిపాలిటీలలో కెసిఆర్, హరీష్ రావుల మార్గదర్శకంలోని గెలుపు సాధ్యమైందని ఏ అర్ధరాత్రి సమస్య ఉందని ఫోన్ చేసిన తక్షణమే స్పందించి సమస్యకు పరిష్కారం చూపించిన ట్రబుల్ షూటర్ హరీష్ రావు పాత్ర కీలకమైందని ఈ గెలుపును ముందుగా వాగ్దానం చేసినట్టుగానే మా అధినాయకుడు కేసీఆర్ కి జన్మదిన కానుకగా అందిస్తున్నామని ఈ ఎన్నికలలో పటాన్చెరువు నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల గెలుపు కొరకు కీలక బాధ్యతలు చేపట్టిన తెలంగాణ మాజీ ఎస్సీ ఎస్టీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికలు పూర్తిగా అప్రజాస్వామికంగా జరిగాయని ఆరోపించారు మా నాయకులపై దాడి చేసి కిడ్నాప్ చేసి ప్రభావితం చేసిన ఎన్ని కుట్రలు చేసిన నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించలేదని ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో విఫలమైనందుకే ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఓటమి పాలు చేశారని అన్నారు.

మున్సిపాలిటీల ఇన్చార్జిలుగా వ్యవహరించిన గొలుసుల శ్రీనివాస్ యాదవ్ పటాన్ చెరువు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌పట్నం మాణిక్యం రెడ్డి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య

ఎమ్మెల్సీ శంభీ పూర్ రాజు జిన్నారం మాజీ జడ్పిటిసి బాల్ రెడ్డి పటాన్చెరు మాజీ జెడ్పిటిసి గడీల శ్రీకాంత్ గౌడ్ తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి పాల సాయిరాం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్ అమీన్పూర్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్ యూత్ నాయకుడు మాణిక్ యాదవులతో పాటు పలువురు నాయకులను కార్యకర్తలను బిఆర్ఎస్ పార్టీకి ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. పటాన్చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీలు బిఆర్ఎస్ కైవసం చేసుకోవడం పట్ల తన ఆనందాన్ని వెలిబుచ్చారు బిఆర్ఎస్ గెలుపు కోసం బాధ్యతలు చేపట్టిన ప్రతి ఒక్కరికి నిత్యం దిశ నిర్దేశం చేస్తూ ఒక గాడ్ ఫాదర్లా మా వెన్నంటి ఉన్న మాజీమంత్రి హరీష్ రావు వలెనే ఈ గెలుపు సాధ్యమైందని అన్నారు మున్సిపాలిటీలో సాధించిన ఈ విజయం ఏ ఒక్కరికి సొంతం కాదని కెసిఆర్ హరీష్ రావుల సలహా సూచనలతో అహర్నిశలు పనిచేసినటువంటి ఇన్చార్జిలకు కార్యకర్తలకు బిఆర్ఎస్ కుటుంబానికి ఈ గెలుపు చెందుతుందని అన్నారు.

# నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవును సన్మానించిన

**కొల్చారం మండలం బిజెపి నాయకులు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) నర్సాపూర్ నూతనంగా మున్సిపల్ వైస్ చైర్మన్ గా బుచ్చేష్ యాదవును ఎన్నికైన సందర్భంగా వారి నివాసంలో మర్యాదగాపూర్వకంగా కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో పూలమాలతో ఘనంగా సత్కరించిన కొల్చారం మండలం బిజెపి పార్టీ అధ్యక్షులు పంతులు హరీష్ మరియు బిజెపి పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎంచర్ల శేఖర్ యాదవ్, రాంపూర్ మాజీ ఎంపిటిసి యాదగిరి, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణ ప్రజలకు బిజెపి పార్టీ నాయకులకు తమ గెలుపు కోసం షాయ శక్తులు కృషిచేసి ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు

నాపై నమ్మకం ఉంచి బిజెపి పార్టీ మున్సిపల్ వైస్ చైర్మన్ గా నియమించినందుకు మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు, మరియు బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేశం గౌడ్, మరియు బిజెపి పార్టీ సీనియర్ నాయకులకు కార్యకర్తలకు మీరు ఇచ్చిన పదవిని బాధ్యత రహితంగా తీర్చిదిద్దుతానని నమ్మకం ఈ పదవిని నర్సాపూర్ పట్టణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్ తెలిపారు ఈ కార్యక్రమంలో కొల్చారం మండలం బిజెపి నాయకులు సాదుల దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ మున్సిపల్ పీఠం కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ

**ఎక్స్ అఫీషియో ఓటుతో చైర్మన్ పదవి దక్కించుకున్న కాంగ్రెస్**

**చైర్మన్ గా కానుగు రాధిక**

**- వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్**





మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) సోమవారం మెదక్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పదవి ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికలు జరిగాయి చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుచుకున్న 14 మంది కౌన్సిలర్లతో పాటు బీఎస్పీ 1, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఎక్స్ అఫీషియో ఓటుతో చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకుంది .ముందుగా 32 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేపట్టారు తర్వాత నిర్వహించిన చైర్మన్ ఎన్నికలకు 24వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కానుగు రాధిక మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా 20వ వార్డు కౌన్సిలర్ మన్సూర్ ప్రతిపాదించారు. వారి ప్రతి పాదనను 19వ వార్డు కౌన్సిలర్ గంట సంపత్ బలపరిచారు .కాంగ్రెస్ పార్టీ తరఫున 14 మంది కౌన్సిలర్లు ఒక బీఎస్పీ కౌన్సిలర్ ఎక్స్ అఫీషియో సభ్యుడు ఎమ్మెల్యే రోహిత్ రావు చేతులెత్తి బలపరిచారు. బిజెపి సభ్యులు ఎన్నిక సమయంలో లేకపోవడంతో 30 మంది సభ్యులలో ఎమ్మెల్యే ఓటుతో కలిపి 16 ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థికి రావడంతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందినట్టుగా ఎన్నికల అధికారులు ప్రకటించారు .బిఆర్ఏస్ పార్టీ తరఫున మూడో వార్డు కౌన్సిలర్ కొట్టాల లలితను ఆ పార్టీ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు ప్రతిపాదించారు. బట్టి ఉదయకుమార్ బలపరిచారు వారికి సరిపోయిన అన్నిఓట్లు లేకపోవడంతో ముందుగా 16 ఓట్లు వచ్చిన కానుగు రాధికను మున్సిపల్ చైర్మన్గా ఎన్నికైనట్లుగా అధికారులు ప్రకటించారు. అనంతరం బి ఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశ మందిరం నుండి బయటకు వెళ్లిపోయారు.కోరం ఉన్నందున వైస్ చైర్మన్ ఎన్నికను ఎన్నికల అధికారులు చేపట్టారు వైస్ చైర్మన్ అభ్యర్థిగా దొంతి నరేష్ గౌడ్ ను అరుణార్థి వెంకటరమణ ప్రతిపాదించారు. తోడుపునూరి శివరామకృష్ణ బలపరిచారు దీంతో వైస్ చైర్మన్ గా దొంతి నరేష్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు .నూతనంగా ఎన్నికైన చైర్మన్ కానుగురాధిక దొంతి నరేష్ గౌడ్ లను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఘనంగా సత్కరించారు. రాబోయే రోజుల్లో అనేక అభివృద్ధిని చేసి చూపుతామని ఆయన తెలిపారు.

# ఢిల్లీలో వైరం... గల్లీలో స్నేహం

**- ఢిల్లీలో కాంగ్రెస్ బిజెపి పార్టీలకు వైరం.**

**- మెదక్ బల్దియా లో దోస్తీ.**

**- మెదక్ ప్రజలను మరోసారి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ.**

**- అధికారంలో లేకున్నా 15 సీట్లు గెలిచాం...**

**- అధికార పార్టీ కన్నా ఒక్క సీట్ బిఆర్ఎస్ కె వచ్చింది.**

**- బిఆర్ఎస్ పార్టీ ఓటు వేసి కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించినందుకు ప్రజలకు, ఓటర్లకు కృతజ్ఞతలు.**

**- మాజీ డిప్యూటీ స్పీకర్ ,బి ఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి**




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) ఢిల్లీలో కాంగ్రెస్, బిజెపి పార్టీలకు వైరమున్న మెదక్ బల్దియాలోకాంగ్రెస్ ,బిజెపి, బీఎస్పీ సహకరించుకోవడం. అనైతిక చర్య అని మాజీ డిప్యూటీ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు . నిత్యం కాంగ్రెస్, బిజెపి నాయకులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తు పోసుకుంటూ... మెదక్ మున్సిపల్ పోరులో ఇరు పార్టీలు సహకరించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మరోసారి మెదక్ ప్రాంత ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని చెప్పారు. అభివృద్ధి పేరుతో ఎన్నికల రాగానే ఇష్టం వచ్చిన వాగ్దానాలు చేస్తూ ప్రజలను ప్రలోభ పెడుతుందని గుర్తు చేశారు. ఎన్నికల్లో మద్యం ,డబ్బు ఏరులై పారిన ప్రభుత్వ అధికారులు, పోలీస్ శాఖ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల్లో అభ్యర్థులపై అట్రాసిటీ కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అభ్యర్థులను ప్రచారం చేయనీయకుండా చేశారని , కేవలం అధికారం కోసమే కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని ఆరోపించారు. ప్రజలు గమనిస్తున్నారని , బిఆర్ఎస్ పై నమ్మకాన్ని ఉంచి కాంగ్రెస్ కన్నా అధిక స్థానాలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే సమయంలో మెదక్లో అవినీతి జరగకుండా చూసే బాధ్యత కౌన్సిలర్ల పై ఉందని, వారికి బి ఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కెసిఆర్ ఆదేశాల మేరకు మెదక్ లో బిఆర్ఎస్ పార్టీ గట్టిగా పని చేసిందని అందుకే ప్రజలు ఆదరించి కాంగ్రెస్ కన్నా పెద్ద మెజార్టీతో సభ్యులను గెలిపించాలని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మెదక్ పట్టణాభివృద్ధి కి కృషి చేస్తామన్నారు. మున్సిపల్ శాఖలో ఏ అవినీతి జరిగిన భయపడకుండా ప్రజల ముందు ఉంచుతామని తెలిపారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ తీర్పును శిరసా వహించి ప్రజల కోరిక మేరకు పని చేస్తామని తెలిపారు. అనంతరం మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ మాట్లాడుతూ.... కెసిఆర్ , హరీష్ రావు మెదక్ గురించి ముందే చెప్పారని, మెదక్ లో రౌడీయిజం నడుస్తుందని నివారించాలంటే బలంగా ప్రజలను ఏకం చేయాలని అన్నారని గుర్తు చేశారు. వార్డులో తిరుగుతుంటే ప్రజలే బిఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టారని రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీని ప్రజలు గుండెల్లో పెట్టుకొని చూస్తారని వారికి తగ్గట్టుగా అభివృద్ధి మరియు వారికున్న సమస్యలపై పోరాటం చేయాలని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ... విపరీతమైన డబ్బులు , మద్యం పంచడంలో కాంగ్రెస్ పార్టీ ముందుందని అన్నారు. బిఆర్ఎస్ కార్యకర్తలపై అధికార పార్టీ పోలీస్ అధికారులతో ఒత్తిడి చేసి ఓట్లను దెబ్బతీయాలని ఆలోచన చేసిందని , అలాంటి పట్టించుకోకుండా ప్రజలు స్పష్టంగా బిఆర్ ఎస్ పార్టీకి మెజార్టీ ఇచ్చారని పేర్కొన్నారు. అట్రాసిటీ కేసుల పోలీస్ అధికారులు పెట్టడం సమంజసం కాదని అన్నారు. అధికార పార్టీకి పోలీసు అధికారులు ఇంతగా సహాయం చేయడం ఎక్కడ చూడలేదని విమర్శించారు. ప్రజలు విశ్వసించి కాంగ్రెస్ కన్నా ఎక్కువ మెజార్టీతో కౌన్సిలర్లను గెలిపించడం కాంగ్రెస్ కు బుద్ధి చెప్పినట్లేనని అన్నారు. ప్రజలు మనపై ఉంచిన విశ్వాసాన్ని మరింత పెంచుతూ మెదక్ మున్సిపల్ లో ప్రతిక్షణం అభివృద్ధి పై పోరాటం చేయాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు విశ్వసించి పూర్తి మెజార్టీతో బిఆర్ఎస్ పార్టీని గెలిపించాలని స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పియడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కెసిఆర్ సూచన మేరకు హరీష్ రావు, పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ పార్టీ పనిచేస్తుందని తెలిపారు. కంఠరెడ్డి. తిరుపతి రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మెదక్ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు. మెదక్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ ఆగడాలను గమనిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ పక్షాన నిలబడతారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులుతోపాటు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లు రాజవ్వ,లలిత, స్వరూప, గంగామణి,జుబెర్ అహ్మద్, అనీస్ ఫాతిమా, సంధ్య, రాజశేఖర్, మహమ్మద్ గౌస్, శృతి,సోహెల్ మోహిద్దీన్, దీపక్, రాణి,ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శివపార్వతుల కళ్యాణంతో త్రిలింగ సంగమేశ్వరాలయంలో ఆధ్యాత్మిక వైభవం

**- గ్రామస్తుల సహకారంతో ఘనంగా శివరాత్రి వేడుకలు**

**- విలాసాగర్ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ శ్రీశ్రీశ్రీ త్రిలింగ సంగమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య, ఆలయ పాలకవర్గం సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం శివపార్వతుల కళ్యాణ వేడుకను ఘనంగా నిర్వహించారు.

వేద పండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాల నాదం మధ్య శివపార్వతుల దివ్య కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కూడా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య మాట్లాడుతూ, “విలాసాగర్ త్రిలింగ సంగమేశ్వర స్వామివారి సన్నిధిలో మహాశివరాత్రి వేడుకలను గ్రామస్తులందరి సహకారంతో నిర్వహించడం ఆనందంగా ఉంది. శివపార్వతుల కళ్యాణం వంటి పావన కార్యక్రమాలు గ్రామానికి ఆధ్యాత్మిక శోభను తీసుకువస్తాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. స్వామివారి కృపతో గ్రామం సుఖశాంతులతో అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాం” అని తెలిపారు.

# కాంగ్రెస్ ఖాతాలో వేములవాడ మున్సిపల్ పీఠం

## - చైర్మన్‌గా పుల్కం రాజు, వైస్ చైర్మన్‌గా నరాల శేఖర్ ఎన్నిక

వేములవాడ (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం సోమవారం ఏర్పడింది. మున్సిపల్ చైర్మన్‌గా పుల్కం రాజు, వైస్ చైర్మన్‌గా నరాల శేఖర్ ఎన్నికయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి నూతన పాలకవర్గ సభ్యులు భీమేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వేములవాడ ప్రజలు అభివృద్ధికి మద్దతుగా స్పష్టమైన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. గతంలో పరిమిత ప్రాతినిధ్యంతో ఉన్న పార్టీ ఈసారి మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులే తమ విజయానికి కారణమని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ దశలవారీగా అమలు చేస్తామని, పట్టణాన్ని అన్ని



రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తమ ప్రధాన



బాధ్యత అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నాయకత్వం, జిల్లా ఇంచార్జి మంత్రుల సహకారంతో వేములవాడ అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. వేములవాడలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం సంతోషకరమని, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని నూతన పాలకవర్గం వెల్లడించింది.

## సామాజిక సేవలో తూడి లచ్చన్న మరో అడుగు

**- విగ్రహ ప్రతిష్టకు టీఎల్ యువసేన**

**అధినేత తూడి లచ్చన్న ఆర్థిక సహాయం**



గంగాధర (ప్రశ్న న్యూస్) కరీంనగర్ జిల్లా,గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలో నిర్వహించనున్న శ్రీ కేతమ్మ-శ్రీ మ్యడాలమ్మ సమేత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి టీఎల్ యువసేన అధినేత, సామాజిక సేవకులు తూడి లచ్చన్న రూ.10,016లను విరాళంగా అందజేశారు. విగ్రహ ప్రతిష్ట విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ తన వంతు సహాయాన్ని అందించినట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గంలో పలు దేవాలయాల నిర్మాణాలు, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలకు ఇంతకుముందు కూడా లచ్చన్న ఆర్థిక సహకారం అందిస్తూ సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలతో పాటు టీఎల్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## ఖాదీర్ హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి

**- మెట్ పల్లి బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి : పసునూరి శ్రీనివాస్**

**- న్యాయవాది ఖాదీర్ హత్యపై ఆగ్రహం - న్యాయవాదుల విధుల బహిష్కరణ**



మెట్‌పల్లి (ప్రశ్న న్యూస్) రంగారెడ్డి బార్ అసోసియేషన్ సభ్యులు ఎండి. ఖాదీర్ పై దాడి చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జగిత్యాల జిల్లా,మెట్ పల్లి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్ నేతృత్వంలో సోమవారం మెట్‌పల్లి కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పసునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఖాదీర్‌పై దాడి చేసి హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాదుల భద్రతకు హామీ కల్పించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ గజేల్లి రాందాస్,కోశాధికారి పడిగేల శ్రీనివాస్, మహిళా ప్రతినిధి ఆకుల మానస, ఏజీపీ అబ్దుల్ హఫీజ్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## వేములవాడ పట్టణాభివృద్ధే లక్ష్యంగా ప్రజల విశ్వాసానికి కట్టుబడి పని చేస్తా

**- వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ : నరాల శేఖర్**

**- వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా నరాల శేఖర్ ప్రమాణ స్వీకారం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ మున్సిపల్ పరిధిలోని 21వ వార్డు కౌన్సిలర్‌గా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన నరాల శేఖర్ సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం నరాల శేఖర్ మాట్లాడుతూ 21వ వార్డు ప్రజలు తనకు ఇచ్చిన అత్యధిక మెజార్టీ విజయాన్ని బాధ్యతగా భావిస్తున్నానన్నారు. నాపై నమ్మకం ఉంచిన ప్రతి ఓటరుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, వేములవాడ మున్సిపాలిటీ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తాగునీరు,పారిశుధ్యం,రోడ్లు, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే వైస్ చైర్మన్‌గా పనిచేస్తానని హామీ ఇచ్చారు. పాలకవర్గంతో కలిసి పారదర్శకంగా, ప్రజాహితానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. వేములవాడ పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

## నేడు మిడ్ మానేరు గేట్ల నుండి నీరు విడుదల పెంపు - దిగువ గ్రామాలకు హెచ్చరిక

**- నీటి పారుదల శాఖ అధికారులు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని కొదురుపాక గ్రామంలో గల శ్రీ రాజేశ్వర మధ్య మానేరు రేడియల్ గేట్ల నుంచి నేడు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం నుంచి దిగువ ప్రాంతాలకు 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం పరిస్థితిని బట్టి విడుదలను దశలవారీగా 4,500 క్యూసెక్కులకు పెంచనున్నట్లు వెల్లడించారు. దీంతో దిగువ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంబంధిత పోలీసు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ద్వారా గ్రామస్తులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని కోరారు. అలాగే మానేరు నదిలో ఏర్పాటు చేసిన మోటార్లను వీలైనంత త్వరగా తొలగించాలని ఇరిగేషన్ శాఖ అధికార యంత్రాంగం సూచించింది.

## కరీంనగర్ కు మేయర్ పీఠం దక్కడం బీజేపీ కి గర్వకారణం

**- కరీంనగర్ జిల్లా భాజపా సీనియర్ నాయకులు : అనుమల్ల చంద్రమౌళి**





కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌పై తొలిసారిగా కాషాయ జెండా ఎగరడం హర్షణీయమని బీజేపీ కరీంనగర్ జిల్లా సీనియర్ నాయకులు,భాజపా చేనేత సెల్ కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షులు అనుమల్ల చంద్రమౌళి పేర్కొన్నారు. నగర పాలక సంస్థ మేయర్‌గా కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్‌గా సునీల్ రావు కేంద్రమంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో బాధ్యతలు స్వీకరించడం అభినందనీయమని ఆయన అన్నారు. ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేస్తూ తొలిసారి మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం పార్టీకి గర్వకారణమని చంద్రమౌళి అన్నారు.

## కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీ ఖాతాలోకి రావడం చారిత్రాత్మకం

**- భాజపా కిసాన్ సెల్ మాజీ వేములవాడ పట్టణాధ్యక్షులు : కొప్పెర సంతోష్ రెడ్డి**



వేములవాడ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో తొలిసారిగా భారతీయ జనతా పార్టీ మేయర్ పదవి సాధించడం పార్టీకి విశేష గౌరవం తీసుకువచ్చిందని బీజేపీ కిసాన్ సెల్ వేములవాడ పట్టణ మాజీ అధ్యక్షులు కొప్పెర సంతోష్ రెడ్డి పేర్కొన్నారు. నగర పాలనలో బీజేపీకి ప్రజలు ఇచ్చిన మద్దతుకు ఇది నిదర్శనమని ఆయన అన్నారు. మేయర్‌గా కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్‌గా సునీల్ రావు బాధ్యతలు చేపట్టడం శుభపరిణామమని అభివర్ణించారు. కేంద్రమంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ మార్గదర్శకత్వంలో పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రతిపక్షాల రాజకీయ వ్యూహాలను అధిగమించి మేయర్ పదవిని కైవసం చేసుకోవడం బీజేపీ శక్తిని చాటిందని సంతోష్ రెడ్డి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో నగరాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ గా మంచునూరి లక్ష్మీరాజు యాదవ్ నియమకం



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) నర్సాపూర్ మున్సిపాలిటీ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్న నేపథ్యంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి రాజి రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సుహాసిని రెడ్డి భారీ విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యమానికి ముఖ్య అతిథిగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఏమ్మెల్యే తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ పాల్గొనారు. నర్సాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ గా ఎన్నికైన మాచునూరి లక్ష్మీ రాజు యాదవ్ ని మరియు కౌన్సిలర్లకు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో మున్సిపాలిటీ పీఠాన్ని గెలుచుకున్నామని, ఇది పార్టీ శ్రేణుల కృషి, కార్యకర్తల త్యాగాల ఫలితమని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు అభివృద్ధికి అనుకూలమని, నర్సాపూర్ పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ చేపడతామని తెలిపారు.. పట్టణ అభివృద్ధికి సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు. పేద, బలహీన వర్గాల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, పారదర్శక పాలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ పారదర్శక, ప్రజాకేంద్రిత పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్,కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్ నాయకత్వానికి కరీంనగర్ ప్రజల సంపూర్ణ మద్దతు

**- కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీ కైవసం హర్షణీయం**

**- భాజపా మండలాధ్యక్షులు : ఎడపల్లి పర్శరాం**

**- మండల కేంద్రంలో భాజపా శ్రేణుల ఘన సంబురాలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మేయర్ పదవిని కైవసం చేసుకుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో పార్టీ ఈ విజయాన్ని సాధించిందని బీజేపీ శ్రేణులు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా బోయినిపల్లి మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ మాట్లాడుతూ, కరీంనగర్ ప్రజలు అభివృద్ధికి ఓటు వేశారని అన్నారు. పారదర్శక, బాధ్యతాయుత పాలన కోసం బీజేపీని ఆశీర్వదించారని, ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. విజయోత్సవాల సందర్భంగా పార్టీ కార్యకర్తలు టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేస్తూ మండలవ్యాప్తంగా సంబరాలు నిర్వహించారు. ఈ విజయాన్ని ప్రజల గెలుపుగా పార్టీ శ్రేణులు అభివర్ణించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభివృద్ధి దిశను అనుసరిస్తూ కరీంనగర్‌ను సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం లక్ష్యమని నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నర్సింహ చారి, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు కొండం శ్రీనివాస్ రెడ్డి, మారం ఉపేందర్, మెరుపుల గంగాధర్ గౌడ్, భోగోజి గంగాధర్ చారి, మిరియాల శరత్ చంద్ర రెడ్డి, మినుకుల శ్రీనివాస్, వెంకటేష్, ఇల్లందుల బాలయ్య, జనగామ లక్ష్మణ్, సారంపల్లి రాజు, కొనుకటి హరీశ్, కళ్యాణం అనిల్, ఐలయ్య, చంద్రయ్య, మహేష్, నాగరాజు, అనిల్, విజయేందర్ రెడ్డి, నిఖిల్, ఆవుల లక్ష్మణ్, ఆంజనేయులు, బుర్ర ప్రదీప్, వంశీ, అఖిల్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణం లో పాల్గొనడం ఎంతో ఆనందాన్నిచ్చింది: కీర్తి సంతోష్ రాజ్

**ఘనంగా శ్రీ మాతా గోవింద మాంబా సమేత**

**పోతులూరివీరబ్రహ్మేంద్ర స్వామి, పార్వతీపరమేశ్వరుల కళ్యాణం**



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ శ్రీనివాసపురం కాలనీలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో శివరాత్రి సందర్భంగా శ్రీ మాతా గోవింద మాంబా సమేత శ్రీ పోతులూరివీరబ్రహ్మేంద్ర స్వామీ,పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ కీర్తి సంతోష్ రాజ్ వీణా దంపతులు,పెరికేటి సుధాకర్ చారి లలిత దంపతులు,యాలాల వంశీధర్ జాహ్నవి దంపతులు,చిట్టోజు బ్రహ్మచారి ధనలక్ష్మీ దంపతులు కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీర్తి సంతోష్ రాజ్ మాట్లాడుతూ శివరాత్రి పర్వదినాన స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, కార్యక్రమం ఏర్పాటు చేసిన గుడి కమిటీ సభ్యులకు మరియు దాతలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని తెలియజేశారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని అర్చక స్వాములు పత్తిపాక



శాంతనాచార్యులు,పత్తిపాక శ్రీధరాచార్యుల ఆధ్వర్యంలో ఈ కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు
భైరోజు రామస్వామి చారి,యాలాల వెంకటేశం చారి, వేములవాడ నరసింహ చారి, కోర్ కమిటీ సభ్యులు,గౌరవ సలహా దారులు,శ్రీవిశ్వకర్మ సంఘం రామంతాపూర్ సభ్యులు భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## నేను ఇండియాలోనే ఉండాలనుకుంటున్నా

### – తాప్సీ సెటైరికల్ కామెంట్స్ వైరల్

సౌత్ నుంచి బాలీవుడ్ వరకు వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి తాప్సీ పన్ను మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 2010లో కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన ఝుమ్మంది నాదం సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన ఆమె, 'మిస్టర్ పర్ఫెక్ట్', 'వీర', 'మొగుడు', 'దరువు', 'షాడో', 'గుండెల్లో గోదారి' వంటి చిత్రాల్లో నటించారు. అయితే తెలుగులో ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోవడంతో బాలీవుడ్‌పై దృష్టి సారించారు. హిందీ చిత్రసీమలో మాత్రం తాప్సీ తన కెరీర్‌ను పూర్తిగా మలుచుకున్నారు. గ్లామర్ పాత్రలకు భిన్నంగా కథా ప్రాధాన్యత గల పాత్రలను ఎంచుకుంటూ నటనతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ముఖ్యంగా పింక్, నామ్ శభాన, థప్పడ్, ముల్క్ వంటి సినిమాలతో ఆమె నటిగా తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. లేడీ ఓరియెంటెడ్ కథలను ఎంచుకోవడం ఆమె ప్రత్యేకతగా మారింది. ఇటీవల ఓ ప్రముఖ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తాప్సీ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాపిడ్ ఫైర్ రౌండ్‌లో "మీకు ఇష్టమైన రాజకీయ నాయకుడు ఎవరు? నరేంద్ర మోదీనా? లేక రాహుల్ గాంధీనా?" అనే ప్రశ్న ఎదురవ్వగా తాప్సీ నవ్వుతూ మోదీ ఫోటో వైపు చేతులు జోడించి నమస్కారం చేశారు. వెంటనే "నాకు ఇంకా ఈ దేశంలోనే ఉండాలని ఉంది" అంటూ చమత్కారంగా సమాధానం ఇచ్చారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. కొందరు ఆమె చమత్కారాన్ని మెచ్చుకుంటూ స్మార్ట్‌గా హ్యాండిల్ చేసిందని అభిప్రాయపడుతుండగా, మరికొందరు ఈ వ్యాఖ్యలను రాజకీయ కోణంలో విశ్లేషిస్తూ ట్రోలింగ్‌కు దిగుతున్నారు. అభిమానులు మాత్రం తాప్సీ ఎప్పటిలాగే బోల్డ్‌గా మాట్లాడిందని ఆమెకు మద్దతు ఇస్తున్నారు. ఇక గతంలో కూడా తాప్సీ టాలీవుడ్‌పై చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. తెలుగులో హీరోయిన్‌లకు సరైన ప్రాధాన్యం ఉండదని, మహిళా పాత్రలకు కథలో బలం తక్కువగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. తాజాగా "నేను ఇండియాలోనే ఉండాలనుకుంటున్నా" అన్న ఒక్క మాటతో మళ్లీ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చారు. ఆమె కామెంట్స్‌పై ఇంకా చర్చ కొనసాగుతూనే ఉంది.

## మెగా మూవీలో చాన్స్?



మలయాళంలో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్న అనస్వర రాజన్.. 'చాంపియన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువైంది. ప్రస్తుతం భాషలకు అతీతంగా సినిమాలు చేస్తూ ఈ మలయాళభామ చాలా బిజీగా ఉంది. ఈ క్రమంలో ఈ టాలెంటెడ్ యాక్ట్రెస్‌కి టాలీవుడ్‌లో మరో అద్భుతమైన అవకాశం వరించినట్టు ఇన్‌సైడ్ టాక్. చిరంజీవి కథానాయకుడిగా కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. తండ్రీకూతుళ్ల అనుబంధమే ప్రధాన ఇతివృత్తంగా సాగే పవర్‌ఫుల్ కథతో తెరకెక్కనున్న ఈచిత్రంలో చిరంజీవి కూతురు పాత్రకు చాలామంది యంగ్ క్రేజీ కథానాయికలను అనుకున్నారు. అయితే.. ఆ అవకాశం చివరకు అనస్వర రాజన్‌ని వరించిందని తెలిసింది. కూతురు పాత్రకు ఈ కథలో అత్యంత ప్రాధాన్యత ఉండటంతో ఈ బరువైన పాత్రకు అనస్వరరాజన్ అయితేనే న్యాయం చేకూర్చగలదని దర్శకుడు బాబీ భావించారట. త్వరలోనే టీమ్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

## కొండంత ప్రేమతో పెదవంత ముద్దు

రవితేజ హీరోగా రూపొందుతున్న ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకుడు. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న ప్రియా భవానీశంకర్ ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాలో ఆమె 'కావేరి' అనే పాత్రను పోషిస్తున్నట్టు మేకర్స్ ప్రకటనలో పేర్కొన్నారు.దఈ ఫస్ట్‌లుక్‌లో ప్రియా భవానీశంకర్ బుగ్గపై హీరో రవితేజ ముద్దుపెడుతూ కనిపించగా, ఆమె సహజమైన ఆహార్యంతో అందంగా నవ్వుతూవుంది. హీరోహీరోయిన్ల మధ్య ప్రేమను ఈ పోస్టర్ ఆవిష్కరిస్తున్నది. నేపథ్యంలో ఉన్న అరటిపళ్ల బండి, హీరోహీరోయిన్ల ఆహార్యాలను బట్టి ఇది గ్రామీణ నేపథ్యంతో కూడిన సినిమా అని తెలుస్తున్నది. ఎమోషన్స్, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో కూడిన పవర్‌ఫుల్ కథ ఇదని, తండ్రీకూతుళ్ల అనుబంధం ఈ కథకు హైలైట్ అని మేకర్స్ చెబుతున్నారు. రవితేజ కూతురుగా బేబీ నక్షత్ర నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విష్ణుశర్మ, సంగీతం: జి.వి.ప్రకాష్‌కుమార్.



## పురుషః స్వరాలు

పవన్‌కల్యాణ్ బత్తుల కథానాయకుడిగా నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'పురుషః'. హాసిని సుధీర్ కథానాయిక. వీరు వులవల దర్శకుడు. బత్తుల కోటేశ్వరరావు నిర్మాత. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా సికింద్రాబాద్‌లోని కస్తూర్బా ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సమక్షంలో ఈ సినిమాలోని పాటను మేకర్స్ విడుదల చేశారు. 'చాటు చాటు..' అంటూ సాగే ఈ పాటను అనంతశ్రీరామ్ రాయగా, శ్రవణ్ భరద్వాజ్ స్వరపరిచారు. చిన్మయి శ్రీపాద ఆలపించారు. ట్యూన్‌కి తగ్గట్టు సహజమైన లొకేషన్లలో ఈ పాటను చిత్రీకరించామని, ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. రాయంచ కొక్కిరి, విశిక, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ ఇందులో కీలక పాత్రధారులు.



## ఆదర్శకుటుంబం కోసం భారీ ఇల్లు?




వెంకటేశ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఇప్పటివరకూ సినిమా రాలేదు. కానీ వెంకీ నటించిన రెండు సినిమాలకు త్రివిక్రమ్ మాటల రాశారు. ఆ రెండూ వెంకటేశ్ కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలిచాయి. అవే.. నువ్వునాకు నచ్చావ్, మల్లీశ్వరి. తెలుగురాష్ట్రాల్లో ఈ సినిమాలను ఇష్టపడని ఆడియన్ ఉండరు. నిజానికి కూడా త్రివిక్రమ్ డైలాగ్‌ని వెంకటేష్ చెప్పినంత టైమింగ్‌లో ఏ హీరో చెప్పలేదన్నది నిజం. అందుకే.. ఇప్పుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ సినిమా వస్తుందంటే, ఆ హీరో ఫ్యాన్, ఈ హీరో ఫ్యాన్ అని కాకుండా, అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 'ఆదర్శ కుటుంబం' పేరుతో రూపొందుతున్న ఈ సినిమాను వేసవిలో విడుదల చేయాలనే లక్ష్యంతో త్రివిక్రమ్ ముందుకెళ్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో ఈ సినిమా కోసం ఓ భారీ ఇంటి సెట్‌ను నిర్మిస్తున్నారు. ఈ సెట్‌లో కీలకమైన సన్నివేశాలను షూట్ చేస్తారట. ఈ నెల నాలుగోవారం నుంచి ఈ ఇంట్లో షూటింగ్ మొదలవుతుంది. ఈ షూట్ అనంతరం పాటల చిత్రీకరణ నిమిత్తం చిత్రబృందం విదేశాలకు వెళ్లనున్నది. హారికా అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఈ సినిమా రూపొందుతున్న విషయం విదితమే.

## ఈ విజయం బాధ్యతను పెంచింది




సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా నటించిన యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. ఈ సినిమా సక్సెస్‌మీట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ విజయంతో తన నమ్మకం నిజమైందని, ఈ సక్సెస్ క్రెడిట్ దర్శకుడిదేననీ, సంతోష్‌శోభన్‌కి హిట్ రావడం ఆనందంగా ఉందని, ప్రేమకథలకు తను చిరునామా కావాలని పంపిణీదారుడు ధీరజ్ మొగిలినేని అన్నారు. ఈ విజయానికి టీమ్ సహకారమే కారణమని దర్శకుడు చెప్పారు. 'నా సినిమా థియేటర్ల ముందు హౌస్‌ఫుల్ బోర్డులను చూడాలనేది నా కల. ఈ సినిమాతో ఆ కల నెరవేరింది. ఎన్నోఏళ్లుగా ఎదురుచూస్తున్న విజయమిది. టీమంతా ప్రాణం పెట్టి పనిచేశారు కాబట్టే ఈ విజయం సాధ్యమైంది. ఈ సినిమా విజయం నటుడిగా నా బాధ్యతను పెంచింది' అని సంతోష్ శోభన్ పేర్కొన్నారు. ఇంకా నిర్మాత అజయ్‌కమార్ రాజు.పి, కథానాయిక మానస వారణాసి కూడా మాట్లాడారు.

## ఎప్పుడూ రాయని నవల ఆధారంగా



నవీన్‌చంద్ర హీరోగా శ్రీకాంత్ నాగోతి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి 'నాట్ ఎ డాక్టర్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. రాహుల్ యాదవ్ నక్కా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం ఈ సినిమా పోస్టర్‌ని విడుదల చేశారు. అడవినేలలో నుంచి బయటకు వస్తున్న మట్టి చేయిని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఆసక్తికరమైన ఏదో కథను ఈ పోస్టర్ చెబుతున్నట్టు అనిపిస్తున్నది. ట్యాగ్‌లైన్ ఈ సినిమా కథలో ఉన్న ఉద్వేగాన్ని తెలియజేస్తున్నది. స్వధర్మ్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు త్వరలోనే వెలువడనున్నాయి.

## దైవత్వం.. విధి.. విధ్వంసం కలబోతగా



సంస్కృతి పరిరక్షణకై జరిగే పోరాటమే ప్రధాన ఇతివృత్తంగా రూపొందుతున్న పానిండియా మహాకావ్యం 'నాగబంధం' అని మేకర్స్ చెబుతున్నారు. విరాట్‌కర్ణ హీరోగా అభిషేక్ నామా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మాతలు. నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలు. సమ్మర్‌లో సినిమా విడుదల కానుంది.ప్రచారంలో భాగంగా ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. సూపర్‌స్టార్ మహేశ్‌బాబు తన ఎక్స్ ఖాతా ద్వారా టీజర్‌ని లాంచ్ చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. 'టీజర్‌లో నాగబంధం ప్రపంచం అద్భుతంగా ఉంది. ఈ అనుభూతిని పూర్తిగా ఎక్స్‌పీరియన్స్ చేయాలని ఎదురుచూస్తున్నా' అని ఎక్స్‌లో మహేశ్‌బాబు పేర్కొన్నారు.ఇక టీజర్ విషయానికొస్తే.. అహ్మద్‌షా అబ్దాలి నేతృత్వంలో జరిగిన ఆఫ్ఘాన్ దాడి నుంచి కొంత ప్రేరణ పొంది తయారు చేసుకున్న కథ ఇదని టీజర్ చెబుతున్నది. మైథాలజీ, చరిత్ర, ఆధ్యాత్మిక మేళవింపుగా, దైవత్వం.. విధి.. విధ్వంసం కలబోతగా ఈ సినిమా ఉంటుందని తెలుస్తున్నది. దర్శకుడు అభిషేక్ నామా గ్రాండ్ విజన్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్టు టీజర్ చెబుతున్నది.డీవోపీ సౌందర్‌రాజన్ విజువల్స్, వీఎఫ్ఎక్స్ ఈ టీజర్‌కి నిండుదనాన్ని తెచ్చాయి. పలు పవర్‌ఫుల్ అవతారాల్లో కనిపించి హీరో విరాట్‌కర్ణ టీజర్‌లో హైలైట్‌గా నిలిచారు. మహేష్ మంజ్రేకర్, జగపతిబాబు, రిషబ్ సాహ్నీ, గరుడరామ్, జయప్రకాశ్, మురళీశర్మ, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మాటలు: కల్యాణచక్రవర్తి, సంగీతం: జునైద్‌కుమార్, అభే, నిర్మాణం: చీ×ఖ స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్.

### హలీమ్ తయారీలో పరిశుభ్రతపై

## అధికారుల సమావేశం




**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ జోన్ జోనల్ కమిషనర్ రవికిరణ్ ఆధ్వర్యంలో హోటల్ యజమానులు, హలీమ్ తయారీదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రమజాన్ సందర్భంగా హలీమ్ తయారీలో పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారుల సూచనలు జారీ చేశారు.సమావేశంలో అధికారులు పలు ముఖ్య సూచనలు చేశారు. హలీమ్ తయారీ సమయంలో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, మాంసాన్ని తప్పనిసరిగా జీహెచ్ఎంసీ స్లాటర్ హౌస్ నుంచే కొనుగోలు చేయాలని తెలిపారు. నాణ్యమైన పదార్థాలనే వినియోగించాలని, హలీమ్ వండే భట్టీలు (చుల్లు) ప్రాంగణంలోనే ఏర్పాటు చేసి ఫుట్‌పాత్‌లు, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు.అలాగే వ్యర్థాలను సరైన విధంగా నిర్వహించి సమయానికి చెత్తను తొలగించాలని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఫుడ్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని హెచ్చరించారు.ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్ అధికారులు, ఫైర్ సేఫ్టీ అధికారులు (హైడ్రా), అసిస్టెంట్ డైరెక్టర్ వెటర్నరీతో పాటు వెటర్నరీ అధికారులు పాల్గొన్నారు.హలీమ్ తయారీదారులు ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని అధికారులు కోరారు.

### పొక్కునూరులో వైభవంగా

## శివ కళ్యాణ మహోత్సవం

**- మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



**చందర్లపాడు (ప్రశ్న న్యూస్ )** మండలం పొక్కునూరు గ్రామంలో ఆదివారం రాత్రి మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన శివ కళ్యాణ మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో, వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి పాల్గొన్నారు.గ్రామ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన శివపార్వతుల కళ్యాణోత్సవాన్ని వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో వీక్షించారు. వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య శివపార్వతుల దివ్య కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజల సంక్షేమం,రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రార్థించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, మహాశివరాత్రి పర్వదినం ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే పవిత్రమైన రోజు అని పేర్కొన్నారు. శివుని అనుగ్రహంతో ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాలలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

## గాంధీ పార్క్ ని అన్ని రకాల వసతులతో సమగ్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటాం

**- నగరపాలక కమిషనర్ మయూర్ అశోక్**



**గుంటూరు(ప్రశ్న న్యూస్)** నగరపాలక సంస్థ గాంధీ పార్క్ ని అన్ని రకాల వసతులతో సమగ్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని, పార్క్ లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రస్తుతం టికెట్ల విక్రయాల ద్వారా వస్తున్న ఆదాయాలు, ఇతర వివరాలతో సమగ్ర నివేదిక అందించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం గాంధీ పార్క్, ట్రావెలర్స్ బంగ్లాలను పరిశీలించి, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ తొలుత గాంధీ పార్క్ లో పర్యటించి, పార్క్ విస్తీర్ణం, వాకింగ్ ట్రాక్, డైనోసార్ స్ట్రక్చర్, స్కేటింగ్ రింగ్, సాఫ్ట్ గేమ్స్ జోన్, వాటర్ గేమ్ జోన్, ఓపెన్ జిమ్, చెస్ బోర్డ్ లను పరిశీలించి, ప్రస్తుతం వాటి స్తితిపై వివరాలు అడిగి తెలుసుకొని, పార్క్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణం ఉన్నవాటిని ఫంక్షనింగ్ లోకి తీసుకురావడానికి, నూతన అభివృద్ధి పనులపై ప్రతిపాదనలతో నివేదిక ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్క్ లో గ్రీనరీ పెంపుపై ఉద్యానవన విభాగ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైతే అదనపు కార్మికులను కేటాయించుకోవాలన్నారు. నగరంలో డివైడర్ల పైన ఉన్న మొక్కలకు ప్రస్తుత వేసవి దృష్ట్యా అదనపు ట్రిప్ ల ద్వారానైనా నీటిని అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పార్క్ ల వారీగా ఉన్న కార్మికుల వివరాలను తమకు అందించాలన్నారు. అనంతరం ట్రావెలర్స్ బంగ్లాని పరిశీలించి, రూమ్ లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రెవెన్యూ అధికారులు గాంధీ పార్క్, ట్రావేలర్స్ బంగ్లా ఆదాయాల పై నివేదిక ఇవ్వాలన్నారు.పర్యటనలో ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, డిఈఈలు హనీఫ్, శ్రీనివాస్, వెంకటరమణ, ఆర్ఓ రవికిరణ్ రెడ్డి, ఎస్ఎస్ సాంబయ్య, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# బీపీ బాధితులకు బిగ్ రిలీఫ్

**- ఇక రోజూ మాత్రలు అవసరం లేదు - ఏడాదికి రెండు ఇంజెక్షన్లు చాలు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అధిక రక్తపోటు ఇప్పుడు పెద్ద సమస్యగా మారుతోంది. అధిక రక్తపోటు కారణంగా గుండె పోట్లు, బ్రెయిన్ స్ట్రోక్ తో పాటుగా అనేక ప్రాంణాంతక సమస్యలు ఎక్కువ అవుతున్నాయి.

### అధిక రక్త పోటు ఉన్నవారికి చికిత్స..

నిరంతరం మందులు అవసరం. వైద్యుల సూచన మేరకు మందులను క్రమం తప్పకుండా వినియోగించాల్సి ఉంటుంది. అయితే, జీవనశైలిలో కొన్ని మార్పులతోనూ బీపీ నియంత్రణలో ఉంచుకోవచ్చు. కాగా ఇప్పుడు మందు మందులు నిరంతరం వాడే వారి కోసం ఏడాదికి రెండు ఇంజెక్షన్లతో బీపీ నియంత్రించే అవకాశం అందుబాటులోకి వచ్చింది.అధిక రక్తపోటు ఉన్నవారికి నిరంతరం బీపీ చెక్ చేసుకోవటం అవసరం. బీపీ స్థాయిలకు గుర్తించి అందుకు అనుగుణంగా వైద్యులు వారికి మందులు సూచిస్తారు. అదే సమయంలో జీవనశైలిలో నూ మార్పులు అవసరం. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, మరియు ఒత్తిడిని తగ్గించుకోవడం వంటివి బీపీని కంట్రోల్ చేసుకోవడానికి సహక రిస్తుంది.పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు మరియు కొవ్వు తక్కువగా ఉండే ప్రోటీన్లు పుష్క లంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. బీపీ తగ్గాలంటే ఉప్పు వాడకం తగ్గించడం కూడా చాలా ముఖ్యం. ఎందుకంటే ఎక్కువ సోడియం వల్ల రక్తపోటు పెరిగే అవకాశం ఉంటుంది. అధిక రక్తపోటును కంట్రోల్లో ఉంచుకోవాలంటే ఒత్తిడిని కూడా తగ్గించుకోవాలి. ఒత్తిడిని తగ్గించుకోవడా నికి ధ్యానం, యోగా లేదా లోతైన శ్వాస వ్యాయామాలు చేయాలి. అదే సమయంలో వైద్యులు సూచించిన విధంగా నిరంతరం మందులు క్రమం తప్పకుండా వాడాలి.

### ఇక ఏడాదికి రెండు ఇంజెక్షన్లతో నియంత్రణ

అయితే, లాన్సెట్ తాజా అధ్యయనాల మేరకు రక్తపోటు నియంత్రణకు ఇక రోజూ మాత్రలు వేసుకోవాల్సిన అవసరం తప్పే అవకాశం కనిపిస్తోంది. రానున్న రోజుల్లో ఏడాదికి రెండు ఇంజెక్షన్లు చేయించుకుంటే చాలు. పూర్తిగా బీపీ నియంత్రణలోకి వస్తుందని తాజా పరిశోధనల్లో గుర్తించారు. ఈ దిశగా శాస్త్రవేత్తల పరిశోధనలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ప్రముఖ మెడికల్ జర్నల్ 'లాన్సెట్' వెల్లడించింది.లాన్సెట్ వెల్లడించిన వివరాల మేరకు అమెరికాకు చెందిన రోష్ అండ్ అల్నైలమ్ ఫార్మాస్యూటికల్స్.. ఆర్ఎన్ఏ టెక్నాలజీతో జిలెబెసిరన్ అనే ఇంజెక్షన్‌ను అభివృద్ధి చేసింది.

ప్రస్తుతం మూడో దశ ట్రయల్స్‌లో ఉంది. ఇది బీపీకి ప్రధాన కారణమైన, కాలేయం నుంచి ఉత్పత్తి అయ్యే యాంజియోటెన్సినోజెన్ అనే ప్రొటీన్‌కు అడ్డుకట్ట వేస్తుంది. ఒక ఇంజెక్షన్ చేస్తే 6 నెలల పాటు సమర్థంగా పనిచేసినట్టు పరిశోధనల్లో గుర్తించారు. దీంతో త్వరలోనే రెండు ఇంజెక్షన్ల ద్వారా బీపీని నియంత్రణలోకి తీసుకొచ్చే వెసులుబాటు కలగనుంది.

## నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా మచునూరి లక్ష్మీరాజు యాదవ్ నియమకం

మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) నర్సాపూర్ మున్సిపాలిటీ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్న నేపథ్యంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి రాజి రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సుహాసిని రెడ్డి భారీ విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యమానికి ముఖ్య అతిథిగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఏమ్మెల్యే తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ పాల్గొనారు.నర్సాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ గా ఎన్నికైన మాచునూరి లక్ష్మీ రాజు యాదవ్ ని మరియు కౌన్సిలర్లకు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో మున్సిపాలిటీ పీఠాన్ని గెలుచుకున్నామని, ఇది పార్టీ శ్రేణుల కృషి, కార్యకర్తల త్యాగాల ఫలితమని పేర్కొన్నారు.

ప్రజలు ఇచ్చిన తీర్పు అభివృద్ధికి అనుకూలమని, నర్సాపూర్ పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ చేపడతామని తెలిపారు.. పట్టణ అభివృద్ధికి సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు. పేద, బలహీన వర్గాల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, పారదర్శక పాలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ పారదర్శక, ప్రజాకేంద్రిత పాలన అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చైర్మన్,కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### తెలంగాణలో 15 ఏళ్లు నిండిన

## అమ్మాయిలకు గుడ్ న్యూస్

**- ఉచితంగా వ్యాక్సిన్ పంపిణీ..**

**- ప్రభుత్వం కీలక ప్రకటన**



**హైదరాబాదు (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గర్భాశయ క్యాన్సర్‌ను అరికట్టేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను పంపిణీ చేసేందుకు సిద్ధమైంది. ఉచితంగా ఈ టీకాను అమ్మాయిలకు అందించనుంది.రాష్ట్రంలో 15 ఏళ్ల వయస్సు ఉన్న అమ్మాయిలకు ఈ టీకా వేస్తారు. రాష్ట్రంలో ఈ వయస్సు ఉన్న అమ్మాయిలు దాదాపు 4 లక్షల మంది ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దీంతో వీరందరికీ ఉచితంగా వ్యాక్సిన్ వేసేందుకు రంగం సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉచిత సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్‌ను అందించనుంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా మైక్రో ప్లానింగ్ సర్వే ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతోంది. ఈ సర్వే ద్వారా 15 ఏళ్ల వయస్సు ఉన్న అమ్మాయిలు ఏ స్కూళ్లల్లో ఉన్నారు.? ఎంతమంది ఉన్నారు.? బయట ఎంతమంది ఉన్నారు.? అనే సమగ్ర వివరాలను సేకరిస్తోంది.

### హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎందుకు.?

ఈ వ్యాక్సిన్ వల్ల మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు. హెచ్‌పీవీ అనే వైరస్ వల్ల సర్వైకల్ క్యాన్సర్ సోకుతుంది. మహిళల్లో దాదాపు 90 శాతం వరకు ఈ వైరస్ వల్లే సర్వైకల్ క్యాన్సర్ బారిన పడుతున్నారు. తెలంగాణలోనూ సర్వైకల్ క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదుతున్నాయి. తెలంగాణలోని మహిళల్లో రొమ్ము క్యాన్సర్ బారిన పడేవారు ఎక్కువమంది ఉండగా రెండో స్థానంలో సర్వైకల్ క్యాన్సర్ ఉంది. దీంతో దీనిని నివారించేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందించేందుకు సిద్ధమవుతోంది. దీని వల్ల మహిళలు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా కాపాడవచ్చని, ఆ వ్యాధిని అడ్డుకునే లక్షణాలు ఈ వ్యాక్సిన్‌కు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

### సర్వైకల్ క్యాన్సర్ ఎందుకు వస్తుంది.?

లైంగిక సంబంధాలు, చిన్న వయస్సులోనే మ్యారేజ్ చేసుకోవడం, ఎక్కువసార్లు ప్రసవాలు, శుభ్రత పాటించకపోవడం వంటి కారణాలతో హెచ్‌పీవీ వైరస్ సోకుతుంది. వైరస్ సోకిన 10 నుంచి 15 ఏళ్ల తర్వాతే దీని లక్షణాలు బయటపడతాయి. దీంతో అమ్మాయిలు యుక్త వయస్సుకు రాగానే ఈ వ్యాక్సిన్ వేయించడం వల్ల సర్వైకల్ క్యాన్సర్ బారిన పాడకుండా కాపాడుకోవచ్చు. దీంతో తల్లిదండ్రులు తమ కూతుళ్లకు ఇది వేయించేలా జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. బయట ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలంటే ఒక్కో డోసుకు రూ.2 వేల నుంచి రూ.4 వేల ఖర్చు అవుతుంది. మూడు డోసుల వ్యాక్సిన్ వేయించుకోవాల్సి ఉంటుంది. దీనికి వేలల్లో ఖర్చు అవుతుంది. దీంతో తల్లిదండ్రులకు ఆ భారం తగ్గించేందుకు ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించింది. వ్యాక్సిన్ల పంపిణీకి ప్రభుత్వం పూర్తి ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమైంది. సిబ్బందికి ట్రైనింగ్ ఇస్తోంది. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాక ఒకసారి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది.

### అన్నదాతలకు ఏఐ,

## అగ్రిటెక్ సేవలు అత్యద్భుతం

**- వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన బిల్ గేట్స్**

**- సాగులో యాప్, డ్రోన్ల వినియోగం పరిశీలన**

**- సీఎం చంద్రబాబుకు, బిల్ గేట్స్‌కు రైతుల ఆత్మీయ స్వాగతం**





**అమరావతి (ప్రశ్న న్యూస్ )** వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సాంకేతిక వినియోగం, ఏఐ ఆధారిత రైతు సేవలను గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఉండవల్లి కరకట్ట సమీపంలోని వ్యవసాయ క్షేత్రాన్ని సోమవారం సందర్శించిన గేట్స్‌కు రైతుల్లో సాంకేతిక వినియోగాన్ని పెంచే కార్యక్రమాలపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వివరించారు. వ్యవసాయం–అనుబంధ రంగాల్లో దిగుబడి పెంపు, సాగు ఖర్చు తగ్గింపుపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను తెలిపారు. అలాగే నాణ్యమైన పంట ఉత్పత్తుల ఎగుమతులకు ప్రత్యేక కార్యాచరణ అవలంభించి రైతులకు అధిక ఆదాయం వచ్చేలా ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రైతు సేవా కేంద్రాల్లో అనలిటిక్స్, మానిటరింగ్ డాష్‌బోర్డులు వినియోగిస్తున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా మహిళా రైతులు మణి, అన్నపూర్ణ ఇటీవల ముఖ్యమంత్రి ప్రారంభించిన ఏపీఏఐఎంఎస్ రైతు యాప్ గురించి గేట్స్‌కు తెలియజేశారు. ఈ యాప్ ద్వారా ఏ పంటలు పండించాలి, సాగునీటి నిర్వహణ, నేల స్వభావం, ధరలు, మార్కెట్ సమాచారం, పురుగు మందుల నియంత్రణ వంటి విషయాలు సులభంగా తెలుసుకుంటున్నామని చెప్పారు. ఏఐ ద్వారా పంట తెగుళ్ల గుర్తింపు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, అలాగే డ్రోన్ సేవలు పొంది పురుగు మందులను వినియోగిస్తున్న తీరును తెలిపారు. బిల్ గేట్స్ సమక్షంలోనే రైతులు ఏఐ టూల్ ఉపయోగించి, వ్యాధి సోకిన మొక్క ఫోటో తీసి అప్లోడ్ చేశారు. ఆ వ్యాధిని ఏఐ గుర్తించి నివారణ సూచనలు అందించింది. అనంతరం డ్రోన్ సేవను బుక్ చేయగా, మొక్కకు వ్యాధి వ్యాపించిన చోట డ్రోన్ స్ప్రే చేసింది. ఇది స్వయంగా చూసిన బిల్ గేట్స్ రైతులకు ఏఐ-అగ్రి టెక్ సేవలు అత్యద్భుతంగా అందిస్తున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసించారు. మరోవైపు స్థానిక రైతులతో బిల్ గేట్స్ ముఖాముఖి చర్చించారు. మొదటగా వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న ముఖ్యమంత్రి, బిల్ గేట్స్‌కు మహిళా రైతులు ఆత్మీయంగా స్వాగతం పలికారు. వారు స్వయంగా వండి తీసుకుచ్చిన స్థానిక వంటలను బిల్ గేట్స్ రుచి చూశారు. ఈ సందర్భంగా సేంద్రీయ సాగు పద్దతులతో పండించిన ఉత్పత్తులను బిల్ గేట్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల మున్సిపాలిటీలో బీఆర్ఎస్ జయకేతనం

**- సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా జిందం కళా--చక్రపాణి బాధ్యతలు**

**- కేటీఆర్ మార్గదర్శనంతో బీఆర్ఎస్ బలోపేతం**

**- బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు : అనుముల భాస్కర్ హర్షం**



**బోయినిపల్లి /సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)** సిరిసిల్ల పురపాలక సంస్థ చైర్‌పర్సన్‌గా జిందం కళా--చక్రపాణి (బీఆర్ఎస్) బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకుడు,నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్లలో బీఆర్ఎస్ పార్టీ సాధించిన విజయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల నియోజకవర్గ శాసనసభ్యులు కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) మార్గదర్శనంలో మున్సిపల్ ఎన్నికల్లో 39 వార్డులకు గాను 27 మంది వార్డు కౌన్సిలర్లు విజయం సాధించడం పార్టీ బలోపేతానికి నిదర్శనమన్నారు.నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా--చక్రపాణి నాయకత్వంలో సిరిసిల్ల మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందనే నమ్మకం ఉందన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పారదర్శక పాలన అందించి, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌళిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను పట్టణ ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ప్రతి వార్డులో సమాన అభివృద్ధి లక్ష్యంగా కొత్త పాలకవర్గం పనిచేయాలని సూచించారు. ప్రజలు ఇచ్చిన తీర్పుకు తగిన విధంగా పనిచేస్తూ సిరిసిల్లను రాష్ట్రంలో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని కోరుకుంటున్నామని అనుముల భాస్కర్ తెలిపారు.

# ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త రైల్వే జోన్

**- 3 డివిజన్లకు పరిమితం కానున్న దక్షిణ మధ్య రైల్వే**

**- విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా జోన్ కేంద్రంగా కార్యకలాపాలు**




**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** దక్షిణమధ్య రైల్వే పునర్విభజన ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. కొత్త రైల్వే జోన్ కు అపాయింటెడ్ డేను కేంద్ర ప్రభుత్వం తొందరలోనే ప్రకటించనున్నట్టు తెలిసింది. ఏప్రిల్ నుంచి నూతన రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభింపజేయాలని రైల్వేశాఖ భావిస్తున్నట్లు ద.మ. రైల్వే వర్గాలకు సంకేతాలు అందినట్లు సమాచారం. ఇది అమల్లోకి వస్తే ఆరు డివిజన్లతో సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న ద.మ. రైల్వే జోన్ సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్లకే పరిమితం అవుతుంది. మిగతా విజయవాడ, గుంటూరు,గుంతకల్లుతో పాటు తూర్పు కోస్తా జోన్ లోని కొంతభాగంతో కలిపి కొత్తగా ఏర్పడే విశాఖపట్నం డివిజన్తో కలిపి దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటవుతుంది.

### ఉన్న సమయం తక్కువే

కొత్త జోన్ కు ఏప్రిల్ 1వ తేదీ అపాయింటెడ్ డే అంటే ఇంకా ఆరు వారాలే ఉంది. కొత్త జోన్ ప్రారంభానికి ఇంత తక్కువ సమయం సాంకేతికంగా సరిపోతుందా అన్న కోణంలోనూ రైల్వేబోర్డులో చర్చ జరిగినట్లు తెలిసింది. సాధ్యాసాధ్యాలపై కొద్దిరోజుల్లోనే స్పష్టత వస్తుందని.. నెలాఖరుకల్లా కొత్త జోన్ అపాయింటెడ్ డేపై నోటిఫికేషన్ రావచ్చుంటూ ద.మ. రైల్వే ప్రధాన కార్యాలయం అధికారులు అంటున్నారు. డివిజన్ల వారీగా విభ సరిహద్దుల్లో మార్పులు చేర్పులు, ఆదాయ వ్యయాలు, రైళ్ల నిర్వహణ సహా పలు అంశాలతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రైల్వేబోర్డుకు తొమ్మిది నెలల క్రితమే చేరింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో విశాఖపట్నం కేంద్రంగా కొత్తగా రైల్వే జోన్ ఏర్పాటు చేయనున్నట్లు అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. నూతన జోన్కు కేంద్ర మంత్రివర్గం 2025 ఫిబ్రవరిలో ఆమోదం తెలిపింది. కొన్ని నెలల నుంచే కొత్త జోన్ జీఎం, విభాగాధిపతులను బోర్డు దశలవారీగా నియమిస్తోంది.

### మార్పులు, చేర్పులు ఇవే

గుంతకల్లు డివిజన్లో ఉన్న రాయచూరు-వాడి 108 కి. మీ. ల సెక్షన్ సికింద్రాబాద్ రైల్వే డివిజన్కు పరిమితం కానుంది. విష్ణుపురం-పగిడిపల్లి, విష్ణుపురం-జానపహాడ్ 142 కి.మీ.ల మార్గాలు ప్రస్తుతం గుంటూరు డివిజన్లో ఉండగా అవి సికింద్రాబాద్కు బదిలీ అవుతాయి. 46 కి. మీ.ల మోటుమర్రి-కొండపల్లి మార్గం సికింద్రాబాద్ నుంచి విజయవాడ డివిజన్ పరిధిలోకి వెళతాయి

# బంగారం ధర రూ.1 లక్షకు తగ్గుతుందా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అమెరికా, రష్యా మధ్య డాలర్తో వాణిజ్యం జరిగితే బంగారం ధరలు తగ్గే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. 'యూఎస్ డాలర్తో ట్రేడ్కు రష్యా సిద్ధమవుతోందని బ్లూమ్బర్గ్ చెప్పింది. అదే జరిగితే 10 గ్రాముల గోల్డ్ 1 లక్షకు పడిపోవచ్చు. 2027 నాటికి 90 వేలు- లక్ష మధ్య స్థిరపడొచ్చు' అని స్ట్రాటజిస్ట్ అమిత్ గోయల్ అన్నారు. ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ?1.57 లక్షలుగా ఉంది.

# బంగాళాఖాతంలో అల్పపీడనం.. నెలాఖరున వర్షాలు



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సోమవారం అల్పపీడనంగా మారింది.. దీని ప్రభావంతో ఈనెల 25 నుంచి 28 వరకు తెలంగాణ, ఏపీలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు ఏపీ రాష్ట్రంలో చలి తీవ్రత తగ్గి పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.ఇప్పటికే పలు జిల్లాల్లో ఉష్ణోగ్రత 30 డిగ్రీలు దాటగా, నెలాఖరుకు గరిష్ఠంగా 40 డిగ్రీలకు చేరే సూచనలున్నాయని అధికారులు హెచ్చరించారు.

# పెంచిన విశాఖ డెయిరీ పాల ధరలు రద్దు చేయాలి

## - సిపిఎం డిమాండ్




**విశాఖపట్నం (ప్రశ్న న్యూస్)** విశాఖ డెయిరీ యాజమాన్యం లీటర్ పాలపై రెండు రూపాయలు ధరపెంచి ప్రజల పై భారం వేసింది. తక్షణమే పెంచిన ధరను రద్దు చేయాలని డెయిరీ యాజమాన్యాన్ని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తోంది. ధరలు పెంపుకు యాజమాన్యం చెపుతున్న సాకులు ప్రజలను వహించడమే. 2025 సెప్టెంబరు లో జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ డెయిరీకి సంబంధించిన వివరాలు ప్రకటించారు. దీని ప్రకారం 2024 -25 ఆర్థిక సంవత్సరంలో విశాఖ డెయిరీ 1755 కోట్లు టర్నోవర్,8.51 కోట్ల రూపాయలు నికర లాభం ఆర్జించింది. 19.28 కోట్ల లీటర్ల పాలను, 5.8 కోట్ల లీటర్ల పెరుగును విక్రయించింది. విశాఖపట్నం విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం ,అనకాపల్లి ,పాడేరు తోపాటు తూర్పుగోదావరి పశ్చిమగోదావరి జిల్లాల నుంచి 3700 పాల సేకరణ కేంద్రాలు ,మూడు లక్షల మంది రైతులు నుండి సుమారు 28 కోట్ల లీటర్ల పాలను సేకరించింది. 2005-26 ఆర్థిక సంవత్సరంలో టర్నోవర్ 2000 కోట్లు ,20 కోట్లు లాభాలు ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పెద్ద ఎత్తున లాభాలు ఆర్జిస్తున్న డెయిరీ యాజమాన్యానికి లాభాల దాహం తీరడం లేదు. లేబర్ ఖర్చులు పెరిగాయనడం ప్రజలను వహించడమే. వాస్తవంగా విశాఖ డైరీ యాజమాన్యం సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు చట్ట ప్రకారం వేతనాలు చెల్లించడం లేదు. మహిళలతో సహా అతి తక్కువ వేతనాలతో వెట్టి చాకిరి చేయించుకుంటోంది. కార్మికులు సంఘం పెట్టి, పెంచుకున్న వేతనాలను కూడా మరల తగ్గించి వేసింది. సుమారు 400 మందిని అన్యాయంగా తొలగించింది. చాలా కాలం నుండి రైతులు పాల సేకరణ ధర పెంచాలని విన్నవించుకుంటున్నా ఖాతరు చేయడం లేదు. ఇలా రైతులను ,కార్మికులను, పాల వినియోగదారులైన ప్రజలను దోపిడీ చేసి డైరీ యాజమాన్యం తన సంపదను పెంచుకుంటోంది.రాజకీయంగా తనకున్న పలుకుబడిని ఉపయోగించుకుని చట్టాల నుండి తప్పించుకుంటోంది..రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే జోక్యం చేసుకొని విశాఖ డైరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి. పెంచిన పాల ధరలను వెంటనే రద్దు చేయించాలని,డెయిరీ యాజమాన్యం చట్టబద్ధంగా వ్యవహరించేలా చర్యలు చేపట్టాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తోంది. గతేడాది మే 10న పాల ధరను రెండు రూపాయలకు పెంచిన యాజమాన్యం, 9 నెలల వ్యవధిలోనే వినియోగదారులపై మరో రెండు రూపాయలు అదనపు భారం మోపడం దుర్మార్గం. అన్యాయంగా పెంచిన పాల ధరలను ప్రజలు తిరస్కరించాలని సిపిఎం పార్టీ పిలుపునిస్తున్నది.

# సాగర తీరంలో నౌకాదళ విన్యాసాలు... నేడు విశాఖకు రాష్ట్రపతి ముర్ము..

- విశాఖలో అంతర్జాతీయ ప్లీట్ రివ్యూ.. హాజరుకానున్న రాష్ట్రపతి ముర్ము..
- 70కి పైగా యుద్ధనౌకల ఫ్లీట్ను సమీక్షించనున్న సర్వ సైన్యాధ్యక్షురాలు..
- ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధనౌక ఈసారి ప్రత్యేక ఆకర్షణ..
- ఐఎఫ్ఆర్తో పాటు మిలాన్, హిందూ మహాసముద్ర సింపోజియం కూడా..
- మూడు ప్రధాన నౌకాదళ ఈవెంట్లకు భారత్ ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి..



**విశాఖపట్నం(ప్రశ్న న్యూస్)** అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)లో పాల్గొనేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నేడు విశాఖపట్నం రానున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆమె ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయుధ దళాల సర్వ సైన్యాధ్యక్షురాలి హోదాలో రాష్ట్రపతి ఈ విన్యాసాలను సమీక్షిస్తారు. అంతర్జాతీయ నౌకాదళ ప్రతినిధులు, యుద్ధనౌకలు, జలాంతర్గాములు, విమానాలు ఒకచోటకి చేరి తమ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించడమే ఐఎఫ్ఆర్ ముఖ్య ఉద్దేశం. నేడు రాష్ట్రపతి గౌరవార్థం ఇచ్చే విందుతో ఐఎఫ్ఆర్-2026 కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. మరుసటి రోజు విశాఖ తీరంలో ఏర్పాటు చేసిన యాంకరేజ్ ప్రాంతంలో భారత్తో పాటు స్నేహపూర్వక దేశాలకు చెందిన సుమారు 70 యుద్ధనౌకల ఫ్లీట్ను రాష్ట్రపతి సమీక్షిస్తారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పాల్గొంటారు. దేశాల మధ్య సముద్రయాన శక్తిని, సహకారాన్ని, స్నేహాన్ని ప్రదర్శించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని భారత నౌకాదళం వివరించింది.ఈసారి ఐఎఫ్ఆర్లో 'ఆపరేషన్ సిందూర్' హీరో, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ నౌకాదళాన్ని కట్టడి చేయడంలో ఈ యుద్ధనౌక వ్యూహాత్మకంగా కీలకపాత్ర పోషించింది. మిత్ర దేశాల నౌకాదళాలు ఈ విమాన వాహక నౌకను సమీపం నుంచి పరిశీలించనున్నాయి.ఈసారి విశాఖ కేవలం ఐఎఫ్ఆర్కే కాకుండా మరో రెండు కీలక కార్యక్రమాలకు కూడా వేదికైంది. భారత నౌకాదళం ఆధ్వర్యంలో 13వ ఎడిషన్ మిలాన్-2026, హిందూ మహాసముద్ర నౌకాదళ సింపోజియం సదస్సు కూడా ఇక్కడే జరుగుతున్నాయి. 135కి పైగా దేశాలను మిలాన్ విన్యాసాలకు ఆహ్వానించారు. భారత్ ఈ మూడు ప్రధాన సముద్రయాన కార్యక్రమాలను ఒకేసారి నిర్వహించడం ఇదే ప్రప్రథమం.భారత్లో తొలి ఐఎఫ్ఆర్ను 2001లో ముంబైలో నిర్వహించగా, అప్పటి రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ సమీక్షించారు. రెండోసారి 2016లో విశాఖపట్నంలో నిర్వహించగా, అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఇప్పుడు మూడోసారి జరుగుతున్న ఈ కార్యక్రమం ద్వారా భారత నౌకాదళ శక్తి, అంతర్జాతీయ సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి.

# నిమ్స్ విస్తరణపై సర్కార్ ఫోకస్

**- ఓపీ సేవల నుంచి సర్జరీల దాకా అన్నింటా వృద్ధి - ఆ మేరకు గత రెండేండ్లలో భారీగా పెరిగిన ప్రభుత్వ గ్రాంట్లు**

**- ఒక్క ఏడాదే రూ.122 కోట్ల సీఎంఆర్ఎఫ్ నిధులు - కొత్తగా 850 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్**

**- తాజాగా 125 వెంటిలేటర్లు మంజూరు - రూ. 1,698 కోట్లతో విస్తరణ పనులు**




**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** పేదల పెద్ద హాస్పిటల్గా గుర్తింపు పొందిన నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్సైన్సెస్( నిమ్స్) కార్పొరేట్ హాస్పిటల్స్ కు దీటుగా వైద్యసేవలు అందిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలతో కొన్ని విభాగాల్లో ఎయిమ్స్ కు మించి సేవలు అందిస్తోంది. రోగుల రద్దీకి తగ్గట్టుగా ప్రభుత్వం కేటాయింపులు పెంచుతోంది. గత రెండేండ్ల గణాంకాలు చూస్తే ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లు, ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ నిధులు దాదాపు రెట్టింపు అయ్యాయి. తాజాగా నిమ్స్ లో సేవల విస్తరణ కోసం 850 కొత్త పోస్టుల భర్తీకి కసరత్తు ప్రారంభించింది.

### నిమ్స్కు నిధుల వెల్లువ..

గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం నిమ్స్ కు నిధులు కేటాయిస్తున్నది. 2022-23లో ప్రభుత్వ గ్రాంట్లు, ఇతరత్రా కలిపి రూ. 256 కోట్లు కేటాయించగా, 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి అది రూ. 323 కోట్లకు చేరింది. ఎక్విప్మెంట్ గ్రాంట్ ఏకంగా రూ. 15 కోట్ల నుంచి రూ.36 కోట్లకు పెరగడం విశేషం. ఇక సీఎం సహాయ నిధి ద్వారా వచ్చే ఆదాయం 2022-23లో రూ. 29 కోట్లు ఉంటే.. ఇప్పుడు అది ఏకంగా రూ. 122 కోట్లకుచేరింది.

ఆరోగ్యశ్రీ లిమిట్ ను రూ.10 లక్షలకు పెంచడంతో ఆరోగ్యశ్రీ ద్వారా వచ్చే రెవెన్యూ రూ.66 కోట్ల నుంచి రూ.102 కోట్లకు చేరింది.ఈ క్రమంలోనే గత రెండేండ్లలో ఇన్పేషెంట్లు 36.6%, ఓపీ రోగులు 29.3% పెరిగినట్లు రికార్డులు చెప్తున్నాయి. రెండేండ్ల కింద 24 వేల సర్జరీలు జరిగితే, ఇప్పుడు ఏకంగా 37,616 సర్జరీలు జరిగాయి. అంటే సర్జరీల్లో ఏకంగా 56% వృద్ధి నమోదైంది. అవయవ మార్పిడిలో నిమ్స్ కి తిరుగులేకుండా పోయింది. కిడ్నీ మార్పిడిలో 1,100 ఆపరేషన్లతో రికార్డు సృష్టించగా.. 90 శాతం ట్రాన్స్ప్లాంట్లు పేదలకు ఉచితంగానే (ఆరోగ్యశ్రీ/సీఎంఆర్ఎఫ్ ద్వారా) జరిగాయి.

### హైలెవల్ సౌకర్యాలు..

పెరుగుతున్న రోగుల అవసరాల కోసం ప్రభుత్వం తాజాగా 125 కొత్త వెంటిలేటర్లను మంజూరు చేసింది. మరోవైపు రూ.1,698 కోట్లతో చేపట్టిన నిమ్స్ విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే డీ-బ్లాక్ లో 95 శాతం తవ్వకం పనులు పూర్తయ్యాయి. 2026 నాటికి ఈ కొత్త బిల్డింగ్ అందుబాటులోకి వస్తే.. మరో 2 వేల పడకలు అదనంగా చేరనున్నాయి. మరో వైపు వైద్య సేవల్లో నిమ్స్ దేశంలోనే మొదటి స్థానం దిశగా దూసుకెళ్తోంది.ముఖ్యంగా న్యూరో సర్జరీ విభాగంలో నిమ్స్ పనితీరు అద్భుతంగా ఉందని, ఈ విషయంలో ప్రతిష్టాత్మక ఢిల్లీ ఎయిమ్స్ ను కూడా నిమ్స్ మించిపోయిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. జటిలమైన బ్రెయిన్ సర్జరీలు, స్పైన్ సర్జరీలను విజయవంతంగా చేస్తూ రికార్డులు సృష్టిస్తోంది. రోబోటిక్ సర్జరీల్లోనూ (100 నుంచి 322కు పెంపు) నిమ్స్ తన మార్క్ చూపిస్తోంది.

### సిబ్బంది కొరతకు చెక్..

నిమ్స్లో పెరుగుతున్న పేషెంట్ల సంఖ్యకు తగ్గట్టుగా డాక్టర్లు, సిబ్బంది లేరన్న విమర్శలకు చెక్ పెడుతూ ప్రభుత్వం భారీ నియామకాలకు తెరలేపింది. అన్ని డిపార్ట్మెంట్లను బలోపేతం చేసే దిశగా 850 పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఇందులో స్పెషలిస్ట్ డాక్టర్లు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది ఉన్నారు. ఈ నియామకాలు పూర్తయితే రోగులకు మరింత వేగంగా, నాణ్యమైన వైద్యం అందుతుంది. ముఖ్యంగా ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ విభాగాల్లో సేవల స్థాయి పెరుగుతుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588